

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

26.11.2026
గురువారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 194
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# సొంత ఆదాయం రూ.74,342 కోట్లు

**గతేడాది ఇదే సమయంలో పోలిస్తే.. 18.7 శాతం వృద్ధి నమోదైంది**

**స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.74,342 కోట్లు**

**స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం**

**గత ఏడాది ఇదే సమయానికి రూ.62,604 కోట్లు**

**ప్రస్తుత ఏడాదిలో రూ.74,342 కోట్లకు పెరిగింది**

**రూ.1,27,506 కోట్ల వార్షిక లక్ష్యంలో..**

**నవంబర్ 23 నాటికే 58 శాతం సాధించింది**




అమరావతి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్
ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.74,342 కోట్లకు రాష్ట్ర సొంత ఆదాయం చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.11,738 కోట్లు అదనంగా ఆదాయ ఆర్జన వచ్చింది. మొత్తంగా చూసుకుంటే.. 18.7 శాతం వృద్ధి నమోదైంది. స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం గత ఏడాది ఇదే సమయానికి రూ.62,604 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఏడాదిలో రూ.74,342 కోట్లకు పెరిగింది రాష్ట్ర సొంత ఆదాయం.

రూ.1,27,506 కోట్ల వార్షిక లక్ష్యంలో నవంబర్ 23 నాటికే 58 శాతం సాధించినట్లు అధికారులు వివరించారు. రూ.10,104 కోట్ల మేర పన్ను ఆదాయం పెరిగింది. గత ఏడాది ఇదే కాలానికి రూ.53,692 కోట్లు ఇది నమోదైంది. ఈ ఏడాది రూ.63,796 కోట్లకు పన్ను ఆదాయం చేరింది. పన్నుల ద్వార వచ్చే ఆదాయంలో 18.8 శాతం వృద్ధి నమోదవ్వగా.. పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి ఉంది.
వాణిజ్య పన్నుల ఆదాయం 18.3 శాతం వృద్ధితో రూ. 5,917 కోట్లకు పెరిగింది. 18.1 శాతం వృద్ధితో రూ.3,694 కోట్ల మేర జీఎస్టీ ఆదాయం పెరిగింది. స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.20,083 కోట్లకు ఎక్సైజ్ శాఖ ఆదాయం చేరింది. 19.6 శాతం వృద్ధితో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.3,287 కోట్లు ఆదాయం పెరిగింది. 16.6 శాతం వృద్ధితో రూ.8,020 కోట్లకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం చేరింది.వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్లలో 17.3 శాతం పెరిగి రూ.3,649 కోట్లకు పన్నుల ఆదాయం చేరింది. 13.2 శాతం పెరిగి రూ. 2,086 కోట్లకు గనులు, భూగర్భ శాఖ ఆదాయం వచ్చింది. 22.3 శాతం పెరిగి రూ. 22 కోట్లకు అటవీ శాఖ ఆదాయం చేరుకుంది. రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు పన్నేతర ఆదాయం పెరిగింది. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు రూ.238 కోట్లకు పంచాయతీల పన్ను ఆదాయం చేరుకున్నది. ఈ ఏడాది నవంబర్ 20 వరకు రూ.2,365 కోట్ల మేర పట్టణ స్థానిక సంస్థల్లో పన్ను ఆదాయం వచ్చింది. 2లో..

## ఢిల్లీ కేఫ్‌లో యువతిపై సామూహిక అత్యాచారం

**ఇద్దరు మహిళలు సహా ముగ్గురు అరెస్టు**

**22 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం**



6లో..

## మేమేం బిచ్చగాళ్లం కాదు

- సీట్ల పంపకంపై ఎస్పీని విమర్శించిన మసూద్
- తదుపరి నిర్ణయం మా చేతుల్లోనేనంటూ
- కూటమిలో విభేదాలపై విమర్శలు
- భారతీయ జనతా పార్టీ ధ్వజం

6లో..

లక్నో, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్
ఉత్తర్‌ప్రదేశ్‌లో మరికొన్ని నెలల్లో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపిణీ వ్యవహారం తీవ్ర విభేదాలకు దారితీస్తోంది. ఒకవైపు పొత్తుపై ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతుండగానే.. ఐదు స్థానాలకు ఎస్పీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ ఏకపక్ష నిర్ణయంపై ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చీఫ్, సహరన్‌పుర్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ బుధవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రూ.19,934 కోట్లు

- తమిళనాడులోని కామరాజా పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్
- 4,288 కోట్ల రూపాయలు కేటాయింపు
- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



2లో..

## మద్యం షాపుల్లో కొత్త రూల్

- మందుబాబుల కష్టాలు తీరినట్లే
- కొత్త స్కానింగ్ మెషిన్లు రాబోతున్నాయి
- మద్యం అమ్మకాల్లో అక్రమాలకు చెక్ పెట్టేలా
- బాటిళ్లు స్కాన్ చేస్తే ధర వివరాలు తెలిసేలా
- మద్యం షాపుల్లోని నిల్వలపైనా రియల్ టైమ్ డేటా

2లో..



అమరావతి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం అమ్మకాలకు సంబంధించి కొత్త రూల్ తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం చర్యలు తీసుకుంటోంది. మద్యం షాపుల్లో బాటిళ్లను స్కాన్ చేసిన తర్వాతే విక్రయించేలా కొత్త విధానాన్ని తీసుకురానుంది. ఈ బాటిల్‌పై ఉండే బార్‌కోడ్‌ను స్కాన్ చేయగానే ధరతో పాటుగా అన్ని వివరాలు కనిపిస్తాయి.

## కోర్టు విచారణల లైవ్, రికార్డింగ్‌పై నిషేధం

- ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు
- వీడియోల అప్‌లోడ్‌పై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు
- న్యాయస్థాన గౌరవం, పవిత్రతను కాపాడేందుకే

2లో..




## ఉగాది తర్వాత పాదయాత్ర

- విజయసాయి రెడ్డి కీలక ప్రకటన



2లో..

అమరావతి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉగాది పండుగ తర్వాత పాదయాత్ర చేపట్టనున్నట్లు పరివర్తన రాజనీతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయసాయి రెడ్డి ప్రకటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, వారి ఇబ్బందులను నేరుగా అర్థం చేసుకోవడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది తర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ గ్రామాలకు వెళ్లి ప్రజలను నేరుగా కలుస్తానని తెలిపారు.

## డిసెంబర్ 5 నుంచి శీతాకాల సమావేశాలు

- పెట్టుబడులు, పరిశ్రమల పురోగతిపై చర్చ!
- సుమారు 15 రోజుల పాటు సమావేశాలు
- ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం

2లో..




## ఏడాదిలో మార్పు రాకుంటే రాజీనామా

- మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి
- ఫ్యాక్షన్ సంస్కృతిని విడనాడి, ప్రశాంతంగా జీవించాలి
- దీనివల్ల గ్రామాలలో అభివృద్ధి జరుగుతుంది



2లో..

## టెక్నాలజీతో పోలీస్ సేవలు మరింత వేగవంతం

- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- ఏఐ పోలీస్ స్టేషన్ పనితీరు పరిశీలన
- మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట
- ఏఐతో పోలీస్ సేవల్లో కొత్త మార్పులు



2లో..

## కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలి

- విపక్షనేతలను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను
- పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు

హైదరాబాద్, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్
కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన విపక్షనేతలను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని చెప్పుకొచ్చారు. ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2లో..





## కోర్టు విచారణల లైవ్,

# రికార్డింగ్‌పై నిషేధం

**న్యూఢిల్లీ, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

న్యాయస్థానంలో విచారణల అనధికార రికార్డింగ్, ప్రసారాలపై ఏపీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. టీవీల్లోనూ, సోషల్ మీడియాలోనూ విచారణలకు సంబంధించిన లైవ్, వీడియోల అప్‌లోడ్‌పై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థాన గౌరవం, పవిత్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హైకోర్టు రిజిస్ట్రార్ వెల్లడించారు. ప్రత్యక్షంగా జరిగే విచారణలతో పాటు వీడియో కాన్ఫరెన్స్ విచారణల రికార్డింగ్‌కూ అనుమతి తప్పనిసరి చేస్తూ ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానంలో జరిగే విచారణలను అనధికారికంగా రికార్డ్ చేయడం, ప్రసారం చేయడాన్ని తప్పుబట్టింది. సంబంధిత అధికారి ముందస్తు అనుమతి లేకుండా ఆడియో, వీడియో, ఫొటోలు, స్క్రీన్‌షాట్లు తీయడాన్ని నిషేధించింది. టీవీ ఛానళ్లు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లలో కోర్టు విచారణలను లైవ్‌లో ఇవ్వడం, లేదా అప్‌లోడ్ చేయడాన్ని నేరంగా పరిగణిస్తామని వెల్లడించింది. ఈ మేరకు న్యాయవాదులు, కక్షిదారులు, మీడియా ప్రతినిధులు, నిబ్బందికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు (W.P. (Civil) No. 751 of 2026), ఏపీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్ నిబంధనలను అందరూ పాటించాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘించినా, అనధికారికంగా ప్రసారం చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం

# రూ.19,934 కోట్లు



**న్యూఢిల్లీ, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

బుధవారం క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రూ.19,934 కోట్ల నిధుల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు. కన్స్ట్రక్షన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టం పథకానికి 11,000 కోట్ల రూపాయలు కేటాయించామని పేర్కొన్నారు. తమిళనాడులోని కామరాజా పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్ ఏర్పాటుకు 4,288 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు.
తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది పారిశ్రామిక ప్రాంతాల నుంచి ఎగుమతి, దిగుమతుల రవాణాకు ఇది ఎంతో తోడ్పడుతుంది. నిర్మాణ సమయంలో సుమారు 750 మందికి, నిర్వహణ దశలో సుమారు 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డ్రెడ్జింగ్ కోసం కామరాజర్ పోర్ట్ మరో రూ. 450 కోట్లు భరించనుంది.
అసోంలోని కచార్ జిల్లాలో బరాక్ లోయకు గుండెకాయ లాంటి దోలూ వద్ద రూ. 2,014 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనున్నారు. 12,351 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పీక్ అవర్‌లో 800 మంది ప్రయాణికులకు సేవలందించేలా టెర్మినల్ భవనం, ఏ320 విమానాలు నడిచేందుకు అనువైన 2,705 మీటర్ల రన్‌వే, 6 విమానాల పార్కింగ్ సామర్థ్యంతో ఆప్రాన్ నిర్మిస్తారు. తేయాకు తోటలు, పర్యాటకం, వాణిజ్యానికి ఇది ఊతమిచ్చి ఈశాన్య భారతాన్ని మరింత అనుసంధానిస్తుంది.
వీటితో పాటు నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీ పర్యావరణ వ్యవస్థ కోసం రూ. 11,000 కోట్ల పథకానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎనిమిదేళ్ల పాటు అమలయ్యే ఈ పథకం ద్వారా షిప్‌టుషోర్ క్రేన్లు, టన్నెల్ బోరింగ్ మెషీన్లు, హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్లు వంటి అత్యాధునిక పరికరాల దేశీయ తయారీని ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 202425లో సుమారు రూ. 97,500 కోట్లుగా ఉన్న భారత సీఐఈ పరిశ్రమ 202930 నాటికి రూ. 2,28,100 కోట్లకు చేరుతుందని అంచనా. అలాగే తపాలా శాఖ పరిధిలోని పోస్టల్ ఆపరేషన్స్ పథకానికి రూ. 1,141 కోట్లు, ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ పథకానికి రూ. 1,491 కోట్ల కేటాయింపులకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

# సొంత ఆదాయం రూ.74,342 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ద్వారా లీకేజీలు తగ్గడం, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడంలో ఆయా శాఖల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. 'రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ఆదాయంలో ప్రతిఫలించాలి. పన్నుల భారం లేకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి. పలు శాఖల్లో పారదర్శకత, ఆన్‌లైన్ విధానం, సంస్కరణల కారణంగా ప్రభుత్వ ఆదాయంలో పెరుగుదల కనిపించింది. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయ వ్యవహారాల్లో ఏఐని వినియోగిస్తోంది.' అని చంద్రబాబు అన్నారు.

### పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై సీఎం చంద్రబాబు సీరియస్

కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన సీఎం.. తక్షణమే పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లా అధికారులను సీఎంఓ కార్యాలయం సమగ్ర నివేదిక కోరింది. ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు ప్రజల అవసరాలకు ఉద్దేశించిన తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేయడాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సీఎంవో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా, అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఎవరినీ ఉపేక్షించవద్దని జిల్లా కలెక్టర్‌కు సీఎంఓ అధికారులు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్.. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను సీఎంవోకు నివేదిక సమర్పించారు. ప్రొద్దుటూరు మండలంలోని సోములవారిపల్లి వద్ద ఇసుక తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించారని కలెక్టర్ తెలిపారు. తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు అక్రమ తవ్వకాలను, ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేశారని వివరించారు.

**ఈ అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్లు, వాటి యజమానులు, ఈ ఘటనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వ్యక్తుల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన నిందితులు, ట్రాక్టర్ యజమానులపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశామన్నారు. దెబ్బతిన్న పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు నివేదికలో కలెక్టర్ పేర్కొన్నారు. పెన్నా, చిత్రావతి నదీ తీరాల్లో అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చెక్‌పోస్టులు, జిల్లా-మండల స్థాయి కమిటీల ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.**

# మద్యం షాపుల్లో కొత్త రూల్

(మొదటి పేజీ తరువాయి)

ఆ బాటిల్ ధర ఎంతో స్కానింగ్ మెషిన్ ద్వారా స్పీకర్‌లో వినిపించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కమాటలో చెప్పాలంటే.. సూపర్ మార్కెట్‌లలో వస్తువులపై ఉండే బార్ కోడ్ స్కాన్ చేసి బిల్లు వేసినట్లుగా.. మద్యం షాపుల్లో కూడా స్కాన్ చేసిన తర్వాత లిక్కర్ బాటిళ్లు విక్రయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు స్కానింగ్ మెషిన్లను కూడా సిద్ధం చేసి సరఫరా చేసే ప్రక్రియ మొదలైందని తెలుస్తోంది..నెలవారీ అద్దెను చెల్లించాల్సి ఉంటుంది.

**మద్యం షాపుల్లో కొత్త రూల్**

రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపుల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బాటిళ్ల విక్రయాలు కొనసాగుతాయి. కేవలం ఆ సమయంలో మాత్రమే ఈ స్కానింగ్ మెషిన్లు పనిచేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఈ మెషిన్లు పనిచేస్తాయి. ఈ విధానాన్ని తీసుకొస్తే మద్యం విక్రయాల్లో పారదర్శకత ఉంటుందని.. మద్యాన్ని ఎక్కువ ధరలకు అమ్మే అవకాశం ఉండదంటున్నారు. మద్యం బాటిళ్లు స్కానింగ్ చేయగానే స్క్రీన్, స్పీకర్ ద్వారా ధరలు తెలుస్తాయంటున్నారు. ఒకవేళ మద్యం బాటిళ్లను స్కాన్ చేయకుండా అమ్మితే వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.. అలాగే ఎక్సైజ్ శాఖ జరిమానాలు విధిస్తుంది. ఈ స్కానింగ్ విధానం ద్వారా మద్యం అమ్మకాల రియల్ టైమ్ డేటా కూడా ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుందని చెబుతున్నారు.
ప్రస్తుతం అమలవుతున్న విధానంలో.. డిస్టలరీల్లో



మద్యం బాటిళ్ల ఉత్పత్తి, అక్కడ మద్యం డిపోలకు తరలించే వరకు ట్రాక్ చేస్తున్నారు. డిపో నుంచి షాపులకు వెళ్లిన తర్వాత వివరాలు ప్రభుత్వం దగ్గర లేకుండా పోయాయి. కొంతమంది మద్యం వ్యాపారులు ధరలు పెంచేసి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వచ్చాయి. తాజాగా తీసుకొస్తున్న స్కానింగ్ విధానంలో ఎంత మద్యాన్ని విక్రయించారో వివరాలు తెలుస్తాయంటున్నారు. ఒక్కో వ్యాపారి ఎంత మేర మద్యం స్టాకు అమ్మాడు.. ఇంకా ఎంత స్టాక్ ఉందో కూడా తెలుస్తుందని చెబుతున్నారు. ఒకవేళ స్టాకులో ఏదైనా తేడా ఉంటే వెంటనే అధికారులకు తెలుస్తుంది.. వెంటనే ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటారు.
ఈ మెషిన్లను ఆప్‌స్టెక్ సంస్థ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మెషిన్లకు ప్రతి నెలా అద్దెను చెల్లించాల్సి ఉంటుంది.. షాపులు నిర్వహించే వ్యాపారులు ఈ అద్దెను కట్టాల్సి ఉంటుందని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా ఈ స్కానింగ్ మెషిన్ల విధానాన్ని తీసుకొచ్చినా పెద్దగా అమలు కాలేదని విమర్శలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ విధానం ఏ మేరకు అమలవుతుందన్నది చూడాలి. అంతేకాదు స్కానింగ్ మెషిన్‌కు అద్దె చెల్లించే విధానంపై వ్యాపారుల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.. ఆ అద్దె తమకు అదనపు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం ఏపీ ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది.

# ఉగాది తర్వాత పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటిపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రెండు కుటుంబాల ఆధిపత్యం కొనసాగుతోందని, దీనివల్ల నిజమైన ప్రజా ప్రాతినిధ్యం అణచివేతకు గురవుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కక్షపూరిత రాజకీయాలు, ఫ్యాక్షన్ రాజకీయాల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని, కేవలం రాజకీయాలను చూస్తూ ఉండకుండా ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి ప్రవేశించాలని విజయసాయి రెడ్డి సూచించారు. యువత చట్టసభల్లో సభ్యులుగా ఎన్నికై ప్రజల గొంతుకను వినిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సామాజిక, రాజకీయ మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు పరివర్తన రాజనీతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయసాయి రెడ్డి.
పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఉగాది తర్వాత తన పాదయాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుంటూ తన పాదయాత్ర సాగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు పేర్కొన్నారు. ఢిల్లీలో బుధవారం నాడు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా మరోసారి టీడీపీ, వైఎస్ఆర్‌సీపీలపై విమర్శలు గుప్పించారు. దశాబ్దాలుగా రెండు కుటుంబాలే అధికారం చెలాయిస్తున్నాయని ఆరోపించారు. రాజకీయాల్లోకి జెన్‌జీ రావాలని, చట్టాలు చేసే స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు.
ఇక, తమ పార్టీలో సామాజిక న్యాయం పాటిస్తామని, తాను అధ్యక్షుడ్ని అయినా.. ముఖ్యమంత్రి అభ్యర్థిని కానని విజయసాయి స్పష్టం చేశారు. శివసేన వ్యవస్థాపకులు బాల్ ఠాక్రే మాదిరిగా కేవలం తాను రాజకీయ సలహాదారుగా ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. ఆత్మగౌరవం కోసమే వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకొచ్చానని అన్నారు. తాను జగన్‌కు వెన్నుపోటు పొడవలేదని, ఆయనే కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నించారని, పదవి ఇవ్వలేదనే కోపంతో కాంగ్రెస్‌ను వీడి సొంతంగా పార్టీ పెట్టుకున్నారని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. తాను పదవులను వదులుకుని పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. 40 ఏళ్లు వైఎస్ కుటుంబం కోసం పనిచేశానని విజయసాయి అన్నారు. అలాగే, వైఎస్ కుటుంబంలో ఆస్తుల వివాదం వారి అంతర్గత వ్యవహారమని పేర్కొన్నారు. వైఎస్ ఆశయాలు ఆయన కుటుంబసభ్యులకు, తనకు, కేవీపీకి మాత్రమే తెలుసని, అయినా వాటిని బయటపెట్టడం మంచి పద్ధతి కాదని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవల పీఆర్పీకి సంబంధించి మూడు ముఖ్యమైన పదవుల్ని విజయసాయి రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా నందమూరి తారకరత్న భార్య, తనకు కుమార్తె వరుసయ్యే అలేఖ్యకు ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించారు. అధ్యక్షుడిగా వేణుంబాక విజయసాయిరెడ్డి కొనసాగుతారు. కోశాధికారిగా దక్షిణామూర్తిని నియమించారు. మరోవైపు, పీఆర్పీ రిజిస్ట్రేషన్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ రద్దుచేసిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీనిని విజయసాయి రెడ్డి ఖండించారు. తప్పుడు ప్రచారం చేస్తూ తమ పార్టీ ఎదుగుదలను అడ్డుకోలేరని ఆయన తేల్చి చెప్పారు. ఏపీలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా తమ పార్టీ ఆవిర్భవిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిసెంబర్ 5 నుంచి శీతాకాల సమావేశాలు

**అమరావతి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 5 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సుమారు 15 రోజుల పాటు సమావేశాలు కొనసాగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులతో పాటు రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది.
శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం కీలకమైన పెట్టుబడుల రక్షణ చట్టం బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక సంస్థలకు రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా రక్షణ కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. పెట్టుబడులకు ప్రోత్సాహకాలు, భూముల కేటాయింపుల విషయంలో చట్టపరమైన భరోసా కల్పించేలా నిబంధనలు రూపొందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అలాగే పరిశ్రమలకు ప్రకటించిన ప్రోత్సాహకాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా ఎస్క్రో విధానాన్ని తీసుకొచ్చే అంశాన్ని కూడా ఈ బిల్లులో చేర్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థల్లో విశ్వాసం పెంచడంతో పాటు మరిన్ని పరిశ్రమలను ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.
అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధి, పరిశ్రమల పురోగతిపై ప్రభుత్వం వివరించే అవకాశం ఉంది. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో పాటు యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై కూడా చర్చ జరగనుంది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వాటి పురోగతిపై సభ్యులు చర్చించే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు కూడా ఈ సమావేశాల్లో కీలక అంశాలుగా మారనున్నాయి. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం వంటి పథకాల అమలు తీరును ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా వివరించే అవకాశం ఉంది. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించే అవకాశం ఉంది.

# ఏడాదిలో మార్పు రాకుంటే రాజీనామా

**అమరావతి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

రాజకీయాల్లో మార్పుకోసం తాడిపత్రితోపాటు యల్లనూరు మండలంలో చదువుకున్నవారికి ఎన్నికల్లో అవకాశం ఇచ్చామని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. తన పిలుపుతో 50 శాతం మంది విద్యావంతులు ఎన్నికల్లో నిలబడ్డారని అన్నారు. ఫ్యాక్షన్ సంస్కృతిని విడనాడి, ప్రశాంతంగా జీవించాలని, దీనివల్ల గ్రామాలలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఏడాదిలోగా తాను ఆశించిన మార్పు రాకపోతే అందరిచేత రాజీనామాలు చేయిస్తానని అన్నారు. తాడిపత్రిలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యావంతులైన యువకులు రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా రాజకీయ ఫ్యాక్షన్ కొనసాగుతోందని, అందుకే గ్రామాలు అభివృద్ధి చెందడంలేదని అన్నారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ గుంపులుగా ఏర్పడి, రిగ్గింగులు చేసేవారని, ఇళ్లపై దాడులు చేసి బాంబులు వేసేవారని అన్నారు. ఆ కాలం పోయిందని, ఇప్పుడు వాహనాలను దహనం చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. అప్పట్లో రాయలసీమ ఫ్యాక్షన్ కర్నూలు, పులివెందుల నుంచి ప్రారంభమయ్యాయని అన్నారు. రాయలసీమవాసులు ముఖ్యమంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి కడప జిల్లాకు భారీగా చేశారని, పులివెందులను ఎవరు చేయని విధంగా అభివృద్ధి చేశారని అన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కనపెడతామని, అవసరమైతే వైసీపీ నాయకుల ఇళ్లవద్దకు కూడా వెళ్లి కలుస్తానని అన్నారు. యాడికి మండలంలో ఎర్రబాబు, బొంబాయి రమేష్ వంటి నాయకులు సహకరించారని అన్నారు. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో నాయకులు అందరూ సహకరించారని అన్నారు. ప్రతి చిన్న పనికి ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదని, వనరులు సృష్టించుకుని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. యాడికి ఆలయానికి 1100 ఎకరాల భూమి ఉందని అన్నారు. కిష్టిపాడు వద్ద గనులు, పెద్దవడుగూరులో వనరులు ఉన్నాయని, పెద్దపప్పూరు మాత్రమే కొంత ఇబ్బందిగా ఉందని అన్నారు. వాటిని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. యాడికి పంచాయతీలో 36 మంది కార్మికులు ఉన్నా, అక్కడ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఒక్కొక్కరికి రూ.6వేలు జీతం చెల్లిస్తున్నారని, నెలకు రెండు లక్షలు పైబడి జీతాలు పోతున్నా అభివృద్ధి జరగడం లేదని అన్నారు. యల్లనూరు మండలంలో దాదాపు 940ఎకరాలు స్వామికి భూమి ఉందని, అయినా అభివృద్ధి చేయలేదని అన్నారు.

# టెక్నాలజీతో పోలీస్ సేవలు మరింత వేగవంతం

**హైదరాబాద్, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

టెక్నాలజీతో పోలీస్ సేవలను మరింత వేగవంతం చేస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఏఐతో పోలీస్ సేవల్లో కొత్త మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్టను ఎంపిక చేశామని తెలిపారు. బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను డీజీపీ సందర్శించారు. ఏఐ పోలీస్ స్టేషన్ పనితీరును పరిశీలించారు. అడిషనల్ డీజీపీ అకూన్ సబర్వాల్, హైదరాబాద్ సీపీ సుధీర్ బాబుతో కలిసి పరిశీలించారు.

**పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఐ వ్యవస్థ..**

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా తొలిసారిగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఐ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలీస్ అధికారుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఆయా ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ యంత్రం ముందు బాధితులు తమ సమస్యను వివరిస్తే చాలని తెలిపారు. బాధితులు చెప్పిన వివరాలతో ఫిర్యాదు కాపీ సిద్ధం అవుతుందని అన్నారు. ఆటోమేటిక్‌గా సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేరుతాయని వివరించారు. టెక్నాలజీతో పోలీస్ సేవలను మరింత వేగవంతం చేసే దిశగా చర్యలు చేపట్టామని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.




# కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

'కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సహా అరెస్ట్ చేసిన అఖిలపక్ష నాయకులందరినీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలి. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన ఈ భూములను వేలం వేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులు. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే తప్ప, ఇష్టానుసారంగా అమ్మి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించడం కాదు. ఈ నెల 27న జరగనున్న ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలి. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలి. అరెస్ట్‌లతో ప్రజల గొంతును నొక్కలేరు. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ అఖిలపక్షాలతో కలిసి పోరాటం కొనసాగిస్తుంది. వేలం రద్దు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# విశ్వసుందరిగా ఫ్యూర్టోరికో భామ

**- ప్రశ్నకు అదిరిపోయే సమాధానం**
**- మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ గత ఏడాది విజేత**
**- జెన్నిఫర్‌కు ఈ కిరీటాన్ని అలంకరించారు**

విశ్వసుందరి పోటీలు ముగిశాయి. 75వ మిస్ యూనివర్స్ కిరీటాన్ని ఫ్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో సొంతం చేసుకున్నారు. మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ (గత ఏడాది విజేత).. జెన్నిఫర్‌కు ఈ కిరీటాన్ని అలంకరించారు.ఫ్యూర్టోరిక

# టాయిలెట్ పేపర్లు భారీగా కొంటున్న అమెరికన్లు

ఏఐ టెక్నాలజీ రంగంలో కొన్నేళ్లుగా దూసుకుపోతున్న అమెరికన్లు.. ఇప్పుడు దానికే భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల వరుసగా అమెరికాలో తలెత్తుతున్న టెక్నాలజీ అవాంతరాలు వారిని తీవ్రంగా భయపెడుతున్నాయి. ఎప్పుడో నిత్యావసర సేవలు నిలిచిపోయి.. జనజీవనం స్తంభించిపోయే స్థితి వస్తుందన్న ఆందోళనలు వారిని వెంటాడుతున్నాయి. ఫలితంగా వాళ్లు అత్యవసర సామగ్రిని భారీగా కొనుగోలు చేస్తున్నారు. బ్లాక్‌ఫ్రైడే డీల్స్ కోసం అమెరికా రిటైలర్లు డిస్కౌంట్లకు సమాయత్తం అవుతున్నా.. ధరలు మాత్రం దూసుకుపోతున్నాయి.

ముఖ్యంగా టాయిలెట్ పేపర్లు, జనరేటర్లు, ఫ్రీజ్‌డ్రైయిడ్ ఫుడ్ వంటి వాటి డిమాండ్‌కు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా ఫ్రీజ్‌డ్రైయిడ్ ఆహార పదార్థాల ధర 12% పెరిగింది. గతేడాది ఇదే సీజన్‌లో 9% తగ్గడం విశేషమని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. గతేడాది తాము ట్రాక్ చేసిన 16 స్టాక్స్ జాబితాలో ఒక్కటి మాత్రమే




అందుబాటులో లేదని.. ఇప్పుడు ఆ 16లో దాదాపు మూడో వంతు నో స్టాక్‌గా పేర్కొంది. చివరికి జనరేటర్లు వంటివి లభించడం కూడా కష్టంగా మారింది. టాయిలెట్ పేపర్ల ధర సెప్టెంబర్ నుంచి 4% పెరిగింది. పేపర్ టవల్స్, బ్యాటరీలు, చెత్తబ్యాగ్‌లు వంటి వాటిలో కూడా గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో రేట్లు పెరిగాయి.

క్రిస్మస్ ట్రీస్ట్యా బ్లాక్ ఫ్రైడే, సైబర్ మండే వంటి భారీ డిస్కౌంట్ల సీజన్ రానుండటంతో అత్యవసర సరకులు ఇప్పుడే తక్కువగా లభిస్తాయన్న ఉద్దేశంతో కొనుగోళ్లు మరింత పెరిగాయి. ఇక ప్రొపేన్, బాటిల్డ్ వాటర్, క్యాంపింగ్ గేర్, బియ్యం, క్యాన్లలోని ఆహారం కొనుగోళ్లు పెరిగినట్లు వాల్‌మార్ట్, కాస్ట్‌కో వంటి రిటైల్ దిగ్గజాలు వెల్లడించాయి. జాతీయ స్థాయిలో బ్లాకౌట్ తప్పదంటూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వినియోగదారుల ఆందోళనలను పెంచుతున్నాయి. అమెరికాలో ఎయిర్ ట్రాఫిక్, బ్యాంకింగ్ సర్వీసులు, నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కమ్యూనికేషన్లు వంటి కీలక మైనవి కూడా సాంకేతిక అవాంతరాలతో అవస్థలు పడిన విషయం తెలిసిందే.

# విశ్వసుందరిగా ప్యూర్టోరికో భామ

విశ్వసుందరి పోటీలు ముగిశాయి. 75వ మిస్ యూనివర్స్ కిరీటాన్ని ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో సొంతం చేసుకున్నారు. మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ (గత ఏడాది విజేత).. జెన్నిఫర్‌కు ఈ కిరీటాన్ని అలంకరించారు.

ప్యూర్టోరికోలోని శాన్‌జువాన్‌లో జరిగిన ఈ పోటీల్లో 116 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు. డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా నునెజ్ మొదటి రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా వేగాస్ రెండో రన్నరప్‌గా నిలిచారు. ఇక భారత్ తరపున పోటీపడిన కేరళకు చెందిన 19 ఏళ్ల కాజియా లిజ్ మెజో టాప్30లో చోటు దక్కించుకున్నారు. అయితే, టాప్12కు చేరకుండానే ఆమె ప్రయాణం ముగిసింది.

ప్రశ్నకు అదిరిపోయే సమాధానం..

ఫైనల్ రౌండ్‌లో ఐదుగురు పోటీదారులనూ 'ప్రస్తుతం ప్రపంచానికి నాయకుల నుంచి ఏం కావాలి?' అని




ప్రశ్నించారు. దీనికి జెన్నిఫర్ స్పందిస్తూ.. ప్రపంచానికి వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సహానుభూతి కలిగిన నాయకులు అవసరమని పేర్కొన్నారు. ఇతరులను విమర్శించడం కాకుండా వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలని, తమ విలువలకు కట్టుబడి ఆదర్శంగా నిలవాలని చెప్పి న్యాయనిర్ణేతల మనసు గెలుచుకున్నారు.

పోటీలకు 75 ఏళ్లు.. విశ్వసుందరికి ప్రత్యేక కిరీటం..

మిస్ యూనివర్స్ పోటీలు 1952లో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కిరీటాన్ని రూపొందించారు. 'ది రేడియన్స్ ఆఫ్ యాన్ ఎటర్నల్ లెగసీ' పేరుతో రూపొందించిన ఈ కిరీటంలో 3,150 వజ్రాలను ఉపయోగించారు.

ప్యూర్టోరికోకు ఆరోసారి..

జెన్నిఫర్ విజయంతో ప్యూర్టోరికోకు ఆరోసారి మిస్ యూనివర్స్ టైటిల్ దక్కింది. గతంలో ఆ దేశం నుంచి ఐదుగురు ఈ ఘనత సాధించారు. 1970, 1985, 1993, 2001, 2006, 2026 సంవత్సరాల్లో ఈ దేశ భామలు విశ్వసుందరి కిరీటాలను సొంతం చేసుకున్నారు. 2027లో జరగనున్న 76వ మిస్ యూనివర్స్ పోటీలకు వియత్నాం ఆతిథ్యం ఇవ్వనుంది.

# సీఐఏ కంప్యూటర్లోకి చైనా సైబర్ ఆయుధం

తాడిని తన్నే వాడుంటే.. వాడి తల తన్నే వాడొకడుంటాడన్నట్లుంది అమెరికా నిఘా సంస్థ సీఐఏ పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని ఆ సంస్థ సేకరిస్తే.. ఆ సంస్థ కంప్యూటర్లలోకి చొరబడి హ్యాకర్లు డేటాను అపహరించారు. ఇందుకోసం వాడినట్లు భావిస్తున్న సైబర్ ఆయుధం చైనా తయారీగా అనుమానిస్తున్నారు. అబ్బే మా దగ్గర రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతిలో పడలేదని సీఐఏ చెబుతున్నా.. జరిగిన ఘటన అగ్రరాజ్యాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.

అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ), ది నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ది ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందో మాత్రం అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్యడేటా మాత్రం భద్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటీ చైనా ఆయుధం ఆర్టెక్స్..?

అమెరికా నిఘా సంస్థల కంప్యూటర్లలోకి చొరబడేందుకు చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్‌ను




వాడారు. దాని పేరు ఆర్టెక్స్ . ఈ ఏడాది ప్రారంభంలో ఓ చైనా ఇంజినీర్ దీనిని సైబర్ సెక్యూరిటీ కోసం అంటూ తయారు చేశాడు. జులై నుంచి బహిరంగంగా అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి జపాన్, దక్షిణ కొరియాలోని పలు వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు దీనిని వాడినట్లు ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరికా పై సైబర్ దాడులు చేస్తున్నారు.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌ను టార్గెట్ చేసి..

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా నుంచి సేకరించిన డేటా, ఉపగ్రహ చిత్రాలు, ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ హ్యాకర్ల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. తమకు చేరే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్‌జీఏ స్పందించలేదు.

అమెరికా నిఘా సంస్థలకు ఏమైంది..?

ఇటీవల అమెరికా నిఘా, భద్రతా సంస్థల్లో తరచూ సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు చోటుచేసుకుంటున్నాయి. కొన్నాళ్ల క్రితం నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కీలక నెట్‌వర్క్ మోరాయించింది. అయితే ఇది సైబర్ దాడి కాదని ఎన్ఎస్ఏ తెలిపింది. ఇక అమెరికాలోని క్రిమినల్స్, అనుమానితుల డేటాను ఎఫ్‌బీఐ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి హ్యాకర్లు కాజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా ధ్రువీకరించారు. 'అది ఏమాత్రం క్షేమం కాదు' అని నాడు ట్రంప్ వ్యాఖ్యానించారు. దీంతోపాటు గత వారం అమెరికా వ్యవసాయ శాఖపై కూడా సైబర్ దాడి జరిగింది.

# రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశాలను కొట్టివేసింది. ఈ అంశాన్ని తాజాగా పరిశీలించాలని హైకోర్టుకు సూచించింది.

రాహుల్ గాంధీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ కర్ణాటకకు చెందిన విఘ్నేశ్ శిశిర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరపాలంటూ సీబీఐ, ఈడీలను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ దీనిపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆగస్టులో హైకోర్టు చర్యలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఎటువంటి నివేదికను దాఖలు చేయవద్దని సీబీఐ, ఈడీలను కూడా అప్పట్లో ఆదేశించింది. తాజాగా అలహాబాద్ కోర్టు ఆదేశాలను పక్కనపెట్టిన ధర్మాసనం... ఈ కేసును తాజాగా పరిశీలించాలని, ఈ కేసుల విచారణ అర్హమా? కాదా? అనేది కూడా పరిశీలించాలని సూచించింది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారని కూడా విఘ్నేశ్ పిటిషన్లు దాఖలు చేశారు.



# దలైలామా విషయంలో ఏదో సస్పెన్స్..
# సైలెంట్‌గా దిల్లీలో బంగ్లా కేటాయింపు..!

దిల్లీ: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో వేగంగా పావులు కదులుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం దేశ రాజధాని దిల్లీలోని 'లుటియన్స్' ప్రాంతంలో సైలెంట్‌గా ఆయనకు బంగ్లాను కేటాయించినట్లు సమాచారం. పండిట్ రవిశంకర్ శుక్లా లేన్‌లో ఓ నివాసాన్ని ఇచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దలైలామా కార్యాలయం 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్'కు ఈ బంగ్లాను కేటాయించారు. విదేశాంగ శాఖ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఇలాంటి ప్రభుత్వ నివాసాల కేటాయింపు మూడేళ్ల పాటు ఉంటుంది. అవసరాన్ని బట్టి గడువును పొడిగించే అవకాశం ఉంటుంది. దలైలామా సంస్థను పరిరక్షించడం, ఆయన ఆధ్యాత్మిక సేవలను కొనసాగించడం 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్' ప్రధాన లక్ష్యాలు. మానవతా విలువల ప్రచారం, మత సామరస్యం, టిబెట్ సంస్కృతి పరిరక్షణ, పర్యావరణ రక్షణతో పాటు ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని ప్రోత్సహించడంలోనూ ఈ ట్రస్ట్ పనిచేస్తోంది. మరోవైపు.. దలైలామా తదుపరి వారసుడి ఎంపిక విషయంలో భారత్‌తోనే చర్చలు జరపాలని అమెరికా కమిషన్ సూచించింది. చైనా ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా చూడాలని, తదుపరి దలైలామాను ఎంపిక చేసే అధికారం 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్'కే ఉండాలని స్పష్టం చేసింది. చైనా ఈ ప్రక్రియలో జోక్యం చేసుకుని తనకు అనుకూలమైన వ్యక్తిని తదుపరి దలైలామాగా ప్రకటించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో దలైలామాకు భారత్ ఏకంగా దిల్లీలోని లుటియన్స్‌లో బంగ్లా కేటాయించడం చర్చనీయాంశంగా మారింది.



# ఎస్పీ అభ్యర్థుల ప్రకటన..: 'మేం బిచ్చగాళ్లమా' అంటూ కాంగ్రెస్ మండిపాటు

ఉత్తర్‌ప్రదేశ్‌లో కొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ , కాంగ్రెస్ మధ్య విభేదాలను సృష్టిస్తున్నాయి. సీట్ల సర్దుబాటు కుదరక ఆ పార్టీల నేతలు బహిరంగంగా విమర్శలు చేసుకుంటున్నారు. మేము ఏమైనా బిచ్చగాళ్లమా..? అంటూ కాంగ్రెస్ నేత ఒకరు తీవ్రవ్యాఖ్యలు చేశారు.

మొత్తం 403 శాసనసభ స్థానాలకు గానూ కాంగ్రెస్ పార్టీ 130 సీట్లు కేటాయించాలని కోరుతోంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ సొంతంగా గెలిచింది రెండు స్థానాల్లోనేనని, దానికి అదనంగా 24 సీట్లు కలిపి మొత్తం 26 స్థానాలు ఇస్తామని ప్రాథమిక చర్చల్లో ప్రతిపాదించినట్లు ఎస్పీ ప్రధాన కార్యదర్శి రామ్ గోపాల్ యాదవ్ తెలిపారు. ఇలా సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన కొనసాగుతుండగానే.. ఐదు స్థానాలకు సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. వాటిలో నాలుగింటిలో ముస్లిం, దళిత ఓటర్లు గణనీయసంఖ్యలో ఉన్నారు. యూపీలో పార్టీ పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ వాటిలో రెండు స్థానాలను ఆశించింది. దీంతో ఈ ప్రకటన హస్తం పార్టీని ఆగ్రహానికి గురిచేసింది .

**ఎస్పీ సీట్లు ప్రకటించిన స్థానాల్లో సహరన్‌పుర్ కూడా ఒకటి. ఎస్పీ తీరుపై ఆ నియోజకవర్గ ఎంపీ ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్) తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అసలు వారి ప్రవర్తన ఏంటో నాకు అర్థం కావడం లేదు. మేం బిచ్చగాళ్లలా కనిపిస్తున్నామా..? మేం మీ నుంచి సీట్లు డిమాండ్ చేయకపోయినా.. 26 సీట్లు ఇస్తామంటూ ప్రకటించారు. సర్దుబాటుపై చర్చలు జరుగుతుండగానే.. అభ్యర్థులను ఎలా ప్రకటిస్తారు..?" అని మండిపడ్డారు. మరోవైపు, గెలుపు అవకాశాల ఆధారంగానే మిత్ర పక్షాల మధ్య సీట్ల పంపిణీ ఉంటుందని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.**

**ఈ పరిణామాలను భాజపా ఎద్దేవా చేసింది. మిత్రపక్షాలనే గౌరవించనివారు ఉత్తర్‌ప్రదేశ్ ప్రజలను ఎలా గౌరవిస్తారని వ్యాఖ్యానించింది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా ఎస్పీ ఇలాగే వ్యవహరించింది. ఒకవైపు సీట్ల కేటాయింపుపై చర్చలు జరుగుతున్నాయని చెబుతూనే.. ఆయా స్థానాలకే తన పార్టీ తరపు నుంచి అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్‌కు షాకిచ్చింది. ఇక, అఖిలేశ్ పార్టీ తాజా నిర్ణయంపై కాంగ్రెస్ అధికారికంగా స్పందించలేదు. అయితే అభ్యర్థుల ప్రకటన కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఆశ్చర్యానికి గురిచేసిందని తెలుస్తోంది..!**



# విమానంలో తోటి ప్రయాణికుడిపై వ్యక్తి పిడిగుద్దులు.. బెల్టుతో గొంతు నొక్కేందుకు యత్నం

విమానం గాలిలో ఉండగా ఒక వ్యక్తి తోటి ప్రయాణికుడిపై దాడి చేశాడు. అతడిపై పిడిగుద్దులు కురిపించడంతో పాటు బెల్టుతో గొంతు నొక్కేందుకు ప్రయత్నించాడు. బాధిత ప్రయాణికుడి ఫిర్యాదుతో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం వేళ ఇండిగో విమానం అబుదాబి నుంచి కొచ్చికి వస్తున్నది. కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులు అందులో ప్రయాణించారు.

కాగా, ఆ విమానం గాలిలో ఉండగా వైట్టిలాకు చెందిన రోషన్ మార్టిన్, ముందు వరుస సీటులో కూర్చొన్న త్రిసూర్‌కు చెందిన యూసుఫ్‌పై దాడి చేశాడు. అతడి ముఖంపై పంచ్‌లు ఇచ్చాడు. అంతేగాక మార్టిన్ తన సీటు బెల్ట్ తీసి యూసుఫ్ మెడ చుట్టూ బిగించి అతడి గొంతు నొక్కేందుకు ప్రయత్నించాడు. మార్టిన్ దాడిలో యూసఫ్ కుడి కంటి వద్ద గాయమైంది. అతడి కళ్లద్దాలు పగిలాయి. ఈ సంఘటన ఆ విమానంలో కలకలం రేపింది.

మరోవైపు ఆ ఇండిగో విమానం కొచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాగానే తనపై దాడి చేసిన రోషన్ మార్టిన్‌పై పోలీస్ స్టేషన్‌లో యూసఫ్ ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మార్టిన్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఫిర్యాదుదారుడి వాంగ్మూలం ఆధారంగా నిందితుడిపై తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

# 16న వస్తున్నా... విమానం పంపండి: హసీనా



ఢాకా: రెండేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లనున్నారు! డిసెంబరు 16ను తన ప్రయాణ తేదీగా ప్రకటించారు. ఇందుకోసం బంగ్లాదేశ్ ప్రభుత్వరంగ విమానయాన సంస్థ 'బిమాన్' విమానాన్ని పంపాలని ఆ దేశ సర్కారును కోరారు. 1971 నాటి విమోచన యుద్ధంలో భారత బలగాలతో కలిసి పాకిస్థాన్‌పై విజయం సాధించినందుకు గుర్తుగా ఏటా డిసెంబరు 16ను బంగ్లాలో 'విక్టరీ డే'గా నిర్వహించుకుంటారు. స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు ఆ రోజునే ఆమె ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

79 ఏళ్ల హసీనా.. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఉద్యమం కారణంగా పదవీచ్యుతురాలై 2024 ఆగస్టు 5న భారత్‌కు వచ్చారు. తన ప్రయాణం కోసం అవసరమైన పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు వంటి పత్రాలు అందజేయాలని దిల్లీలోని బంగ్లా హై కమిషన్‌ను హసీనా ఇప్పటికే కోరగా, అందుకు ఢాకా నిరాకరించింది. బిమాన్ విమానాన్ని పంపి సగౌరవంగా స్వదేశానికి తీసుకెళ్లాలన్న హసీనా వినతిని బంగ్లాదేశ్ సర్కారు తిరస్కరించింది. అరెస్టు చేసి సంకెళ్లతో.. పటిష్ఠ నిఘా నడుమ ఆమెను తీసుకెళ్తామని పేర్కొంది. విదేశాలకు పారిపోయిన ఇతర నేరగాళ్ల తరహాలోనే హసీనానూ చూస్తామని స్పష్టం చేసింది.

# కార్తికదీపం వివాదం: సుప్రీంకోర్టుకు విజయ్ ప్రభుత్వం క్షమాపణలు



కార్తిక దీపం వివాదం నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పింది. తమిళనాడులోని మదురై తిరుప్పరంకుండ్రం కొండపై ఎప్పటిలానే ఉచ్చిప్పిళ్లైయార్ ఆలయ దీప మండపంపై నే మహాదీపం వెలిగించారు. ఇక్కడి కొండపై ఉన్న సిక్కందర్ దర్గా వద్ద పురాతన రాతి స్తంభంపై దీపాన్ని వెలిగించాలనే దానిపై వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అక్కడే దీపం వెలిగించాలని గత ఏడాది మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇవ్వగా అవి అమలు కాలేదు. ఈ ఏడాది మాత్రమే రాతి స్తంభంపై కార్తికదీపం వెలిగించాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వులనూ మంగళవారం పాటించలేదు. ఆలయ యంత్రాంగం అనుమతించకపోవడం వల్లే రాతి స్తంభంపై దీపం వెలిగించలేకపోయామని బుధవారం తమిళనాడు ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయడానికి తాను అన్నివిధాలుగా ప్రయత్నించానని మదురై కలెక్టర్ సుప్రీంకోర్టు వెల్లడించారు. కొండపై ఉన్న రాతిస్తంభం వద్ద దీపాన్ని వెలిగించడం వల్ల తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు దెబ్బతింటాయని ఆలయ ట్రస్టీలు అభ్యంతరం వ్యక్తంచేసినట్లు పేర్కొన్నారు. దాంతో తిరుప్పరంకుండ్రం కొండపై ఎప్పటిలానే ఉచ్చిప్పిళ్లైయార్ ఆలయ దీప మండపంపైనే మహాదీపం వెలిగిందని చెప్పారు. ఇదిలా ఉంటే.. ఈ చర్యను కోర్టు ధిక్కరణగా పరిగణించాలంటూ పిటిషనర్లు చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.






# పరీక్షలంటే భూతం కాదు!

**పరీక్షలు: పాదల వెనక పులులు!' అనే శీర్షికతో సెప్టెంబర్ 29న బి.ఆర్.బాపూజీ రాసిన వ్యాసం ప్రస్తుత పరీక్షా విధానంపై కొన్ని ప్రశ్నలను ముందుకు తెచ్చింది. పరీక్షల ఒత్తిడి, బట్టీ చదువు, పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణ, ప్రవేశ పరీక్షల భయం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఉండకూడదన్న విషయంలో ఎలాంటి విభేదం లేదు. కానీ పరీక్షల చుట్టూ ఉన్న కొన్ని లోపాలను చూపించి పరీక్షా వ్యవస్థనే విద్యార్థుల శత్రువుగా చిత్రీకరించడం, పరీక్షల వల్లే విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నాయన్న భావన కనబరచడం సరికాదు.**

**బాపూజీ తన వ్యాసంలో 2014 నుంచి 2024 వరకు దేశంలో 1.23 లక్షల మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వ గణాంకాలను ప్రస్తావించారు. ఈ సంఖ్య ఆందోళన కలిగించేదే. అయితే, ఆ ఆత్మహత్యలన్నింటికీ పరీక్షలే కారణం కాదు. కేంద్ర విద్యాశాఖ 2026లో ఎన్‌సీఆర్‌బీ గణాంకాలను వివరిస్తూ వృత్తి/కెరీర్ సమస్యలు, ఒంటరితనం, కుటుంబ సమస్యలు, మానసిక రుగ్మతలు, హింస, ఆర్థిక సమస్యలు తదితర అనేక కారణాలు ఉండవచ్చని పేర్కొంది. కాబట్టి ఈ విషాద గణాంకాన్ని పరీక్షలపై నేరారోపణ చేయడానికి మాత్రమే కాకుండా, విద్యార్థి జీవితాన్ని చుట్టుముట్టిన మొత్తం ఒత్తిడి వ్యవస్థను సరిదిద్దడానికి హెచ్చరికగా చూడాలి.**

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో సోషియాలజీ ప్రొఫెసర్‌గా తాను అమలు చేసిన పరీక్షా పద్ధతిని బాపూజీ ఉదాహరణగా చెప్పారు. పది ప్రశ్నలను ముందుగానే ఇచ్చి, వాటిలో ఐదింటికి సమాధానాలు రాయించడం, భాషా తప్పులకు మార్కులు తగ్గించకపోవడం, మాతృభాషలో రాయడానికి అవకాశం ఇవ్వడం, కొన్ని సందర్భాల్లో మౌఖికంగా సమాధానాలు చెప్పించడం వంటి పద్ధతులను ఆయన వివరించారు. విద్యార్థి భయాన్ని తగ్గించడం, విషయాన్ని అర్థం చేసుకున్నాడా లేదా అన్నదానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాల్లో ఆ అనుభవం నుంచి నేర్చుకోవాల్సింది ఉంది. ముందుగానే పది ప్రశ్నలు ఇచ్చి వాటిలో ఐదింటికి సమాధానం రాయించడం విద్యార్థి ఆందోళనను తగ్గించవచ్చు. కానీ విద్యార్థి మొత్తం పాఠ్యాంశాన్ని చదివి విస్తృత అవగాహన పెంచుకోవడం కంటే, ముందే ఇచ్చిన ఆ కొన్ని ప్రశ్నలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రశ్నలను ముందుగానే వెల్లడించడం ఒక్కటే ఆధునిక పరీక్షా సంస్కరణ కాదు, ప్రశ్నల స్వభావాన్ని మార్చడం అసలు సంస్కరణ.**

**ఇది కొత్త ఆలోచన కూడా కాదు. కొఠారీ కమిషన్ 1964–66లోనే పరీక్షా సంస్కరణల లక్ష్యం– పరీక్షల విశ్వసనీయత, ప్రామాణికతను పెంచడంతో పాటు మూల్యాంకనాన్ని నిరంతర ప్రక్రియగా మార్చి విద్యార్థి తన స్థాయిని మెరుగుపరుచుకునేలా చేయడమని పేర్కొంది. రాత పరీక్షతో కొలవలేని విద్యార్థి ఎదుగుదలలోని ఇతర అంశాలను కొలిచే పద్ధతులను కూడా అభివృద్ధి చేయాలని కమిషన్ సూచించింది. కాబట్టి 'పరీక్షలకు వ్యతిరేకం', 'పరీక్షల్లో సంస్కరణ' రెండూ ఒకటే కాదు. ఇక 'ఓపెన్ బుక్' లేదా 'ముందుగానే ప్రశ్నలు' అనే పద్ధతుల విషయంలో కూడా సమస్యలున్నాయి. ఉన్నత స్థాయి పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక కోర్సుల్లో ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ ఉపయోగకరంగా ఉండవచ్చు. కానీ విద్యార్థికి ప్రతి ప్రశ్న ముందుగానే ఇచ్చి, అదే ప్రశ్నకు సమాధానం రాయించడం అన్ని స్థాయిలలో అనుకూలం కాదు. ఇవి పరిశోధనా దృక్పథాన్ని ఆలోచనా పరిజ్ఞానాన్ని పరిమితం చేస్తాయి. జ్ఞానాన్ని గుర్తుంచుకోవాల్సిన చోట జ్ఞప్తికి తెచ్చుకోవడం, అర్థం చేసుకోవాల్సిన చోట కీలక భావనల అవగాహన, ఉపయోగించాల్సిన చోట వినియోగం, ఆలోచించాల్సిన చోట విశ్లేషణ, కొత్తదాన్ని సృష్టించాల్సిన చోట సృజనాత్మకత... ఇలా ప్రతి దశకూ తగిన పరీక్షా పద్ధతి ఉండాలి. ఆచరణలో ఈ దిశగా ముందడుగు పడుతోంది కూడా. ఇదే నిజమైన సామర్థ్య ఆధారిత పరీక్ష.**

**పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణ విషయానికి వస్తే విద్యార్థిని ముందుగానే 'దొంగ'గా చూడటం తప్ప. కానీ మరోవైపు కాపీయింగ్‌ను అడ్డుకోవడం కూడా నిజాయితీగా పరీక్ష రాస్తున్న విద్యార్థి హక్కును కాపాడటమే. ఒక విద్యార్థి నెలల తరబడి కష్టపడి సిద్ధమై పరీక్ష రాస్తుంటే, మరొకరు చీటీ లేదా మొబైల్ ద్వారా అక్రమ సహాయం పొందితే ఇద్దరికీ ఒకే ఫలితం ఇవ్వడం సమానత్వం కాదు. అందువల్ల పర్యవేక్షణ ఉండాలి, కానీ అవమానకరంగా కాదు. నియమాలు ఉండాలి, కానీ విద్యార్థిని నేరస్థుడిగా చూసే ధోరణి ఉండకూడదు. పరీక్షలో కాపీయింగ్ చేస్తే నిబంధన ప్రకారం చర్య తీసుకోవాలి. కానీ ఆ చర్య విద్యార్థికి జీవితాంతం ముద్రగా మారకూడదు. మరోసారి పరీక్షలు రాసే అవకాశం, కౌన్సిలింగ్, వ్యక్తిగత రెమెడియల్ టీచింగ్ వంటి మార్గాలు సులభంగా, ప్రామాణికంగా అందుబాటులో ఉండాలి. బోర్డు పరీక్షల్లో కూడా వీటిని అందుబాటులోకి తీసుకురావాలి. సీబీఎస్ఈ కూడా ఇంప్రూవ్‌మెంట్ ఎగ్జామినేషన్‌ను అమల్లోకి తెచ్చింది. ఇదే మనం బలంగా చెప్పాల్సిన 'విఫలమయ్యే హక్కు'. విద్యార్థికి విజయాన్ని సాధించే హక్కు ఎంత ముఖ్యమో, ఒకసారి విఫలమైన తరువాత మళ్లీ ప్రయత్నించే హక్కు కూడా అంతే ముఖ్యమైనది. పరీక్షలో ఫెయిల్ అయితే జీవితం ముగిసినట్లు కాదు. ఒక సంవత్సరం ఆలస్యం అయితే ఓడిపోయినట్లు కాదు. పరీక్ష భూతం కాదు. పరీక్ష ఒక తీర్పు కాదు. పరీక్ష ఒక విద్యార్థి విలువకు కొలమానం కాదు. పరీక్ష ఒక నిర్దిష్ట దశలో నేర్చుకున్నదాన్ని అంచనా వేసే సాధనం మాత్రమే. సమాజానికి కావలసింది పరీక్షల రద్దు కాదు– పరీక్షల సంస్కరణ.**



# తొలగింపు చిన్న విషయమా?

**ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కోట్లాది వయోజన భారతీయుల ఓటుహక్కు తొలగింపునకు దారితీసిందా? భారీ స్థాయిలో ఓటుహక్కు రద్దుపై వెల్లువెత్తిన విమర్శలను కొట్టివేస్తూ... చిన్న విషయంపై పెద్ద రభస చేస్తున్నారని అర్థశాస్త్ర విజ్ఞుడు సుర్జిత్ భల్లా విమర్శలు చేస్తున్న దృష్ట్యా పై ప్రశ్నను మరింత నిశితంగా తరిచించవలసిన అవసరమున్నది.**




ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం కాకముందు ఉన్న ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపుల పైనే 'సర్' చర్చలన్నీ ప్రధానంగా జరుగుతున్నాయి. సర్ పూర్వపు ఓటర్ జాబితాల నుంచి 13.3 కోట్ల పేర్లను తొలగించడమే భారీ స్థాయి ఓటుహక్కు రద్దునకు రుజువు అని ఈ విమర్శకులు ప్రస్తావిస్తున్నారు. అయితే గత ఓటర్ జాబితాలలో పేర్లు అత్యధికంగా ఉన్నాయని తొలగించిన పేర్లు అన్నీ ఓటర్ నమోదులో లేనివారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, మరణించినవారు, ఒకే పేరు రెండుసార్లు ఉన్నవారివేనని సర్ మద్దతుదారులు ప్రతిస్పందిస్తున్నారు. నిజానిజాలు ఏమిటి? భారత ఎన్నికల సంఘం రూపొందించిన సర్ తుది జాబితాలు సరైనవేనని విశ్వసనీయ తనిఖీతో ధ్రువీకరించడం జరగకపోవడంతో వాటిపై గందరగోళం, వివాదాలు నెలకొన్నాయి. అయితే సర్ ఫలితాలను మూల్యాంకనం చేసేందుకు ఒక వివేకవంతమైన పద్ధతి ఉన్నది. సర్ తుది ఓటర్ జాబితాలను ఓటుహక్కుకు అర్హత ఉన్న వయోజన జనాభా అధికారిక అంచనాలతో పోల్చిచూడడం ద్వారా సర్ నిష్పాక్షికతను తెలుసుకోవచ్చు. నిజానికి ఈసీఐ సైతం ఓటర్ జాబితాలను మూల్యాంకనం చేసేందుకు అధికారిక వయోజన జనాభా అంచనాలను ఒక ప్రమాణంగా తీసుకుంటున్నది. కోట్లాది వయోజనుల ఓటుహక్కును రద్దు చేశారన్న ఆరోపణ సమర్థనీయమైనదేనని సర్ తుది ఓటర్ జాబితాలు, వయోజన జనాభా అంచనాల తులనాత్మక పరిశీలన స్పష్టం చేసింది. అంతేకాదు తుది జాబితాలలో పేర్లు లేనివారి సంఖ్యపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడానికి కూడా అది తోడ్పడింది.

సర్ ప్రక్రియ ప్రథమ, ద్వితీయ దశలు అమలయిన తొమ్మిది రాష్ట్రాలలో తుది జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్రాలలోని సమస్త వయోజన జనాభా అంచనాలకు 7 కోట్ల కంటే తక్కువగా ఉన్నది. దాదాపు 12శాతం వయోజనులను తుది జాబితాల నుంచి మినహాయించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. యూపీలో ఇలా ఓటు హక్కు కోల్పోయినవారు మొత్తం వయోజన జనాభాలో 17శాతానికంటే అధికం. ఈ తొమ్మిది రాష్ట్రాలలో సగటు తొలగింపుల రేటు 12శాతం దేశవ్యాప్తంగా మొత్తం తొలగింపులకు కూడా సూచకమయితే తుది ఓటర్ జాబితాలలో లేనివారు దాదాపు 12 కోట్ల మందిగా ఉంటారు. మూడో దశ సర్ ధోరణులను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ సంఖ్య మరింత అధికంగా ఉండవచ్చు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్ మినహా మిగతా రాష్ట్రాలు అన్నిటికీ ముసాయిదా సర్ జాబితాలను విడుదల చేశారు. ముసాయిదా జాబితాలలోనే తొలగింపులు సర్ మూడో దశలో మరింత అధికంగా ఉన్నాయి. మొదటి రెండు దశల ముసాయిదా జాబితాలను సరిదిద్దిన విధంగానే మూడో దశ జాబితాలలోనూ మార్పులు చేయడం జరగవచ్చని భావిద్దాం. అయినప్పటికీ అఖిల భారత స్థాయిలో సర్ అనంతర తుది ఓటర్ జాబితాలలో ఉండే పేర్లు ఇంచుమించు 87.8 కోట్లుగా ఉండగలవని రాహుల్ శాస్త్రి అంచనా వేశారు.

భారతదేశ ప్రస్తుత వయోజన జనాభా 101.6 కోట్లు. అంటే ఓటు హక్కుకు అర్హులైన దాదాపు 14 కోట్లమంది తుది జాబితాల నుంచి జారిపోయారు. వయోజన జనాభా పరిమాణం, ఓటర్ జాబితాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుర్జిత్ భల్లా అంగీకరిస్తూనే, ఈ తేడా ఓటుహక్కు తొలగింపులను సూచించదని వాదిస్తున్నారు. ఓటర్ జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య వయోజన జనాభా సంఖ్యతో సరిసమానంగా ఉండి తీరాలని ఏమీ లేదని ఆయన వాదన. 2024లో ఓటుహక్కుకు అర్హమైన వయసుకు వచ్చిన వారిలో ఎంతోమంది ఓటరుగా నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ చూపలేదని, ఇటువంటి అలక్ష్యపరులు ఆ ఏడాది మొత్తం వయోజనులలో 7.5శాతంగా ఉన్నారని భల్లా చెబుతున్నారు. మిగిలిన జనాభాలోనూ ఇటువంటి తక్కువ నమోదును మరో 1శాతం మేరకు కలుపుకుంటే సాధారణంగా వాటిల్లే లోటు 8.5శాతంగా ఉండగలదని ఆయన నిర్ధారిస్తూ, ఈ 8.5శాతం పరిమితి కంటే ఎక్కువ ఉంటేనే, దానిని మితిమీరినదిగా, న్యాయ విరుద్ధమైనదిగా పరిగణించాలనేది సుర్జిత్ భల్లా వాదన.

సుర్జిత్ భల్లాతో మేము విభేదిస్తున్నాం. ఇవీ మా కారణాలు: మొదటిది- భారతదేశంలో ఓటర్ గుర్తింపు కార్డు ఒక ముఖ్యమైన డాక్యుమెంటు. ఈ గుర్తింపు కార్డును కలిగి ఉండేందుకు ఇంచుమించు ప్రతి వయోజనుడూ ఆరాటపడుతున్నాడు. ఓటర్ గుర్తింపు కార్డు లేని పక్షంలో ప్రభుత్వ వ్యవస్థల నుంచి అందే వివిధ సేవలను కోల్పోవాల్సి వస్తుంది. ఓటుహక్కుకు అర్హమైన వయసు వచ్చినవారు స్వచ్ఛందంగా ఓటరుగా నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ చూపకపోవడమనేది ఒక సాధారణ పరిణామంగా ఈసీఐ సైతం చూడడం లేదు. ఓటర్ల నమోదు అనేది రాజ్యవ్యవస్థ చొరవతో ప్రారంభమయ్యే ప్రక్రియ. దేశ పౌరులు ఓటరుగా నమోదు చేయించుకోకపోవడమనేది ఎన్నికల సంఘం వైఫల్యంగా పరిగణించి తీరాలి. దీనిని సరిదిద్దుకోవచ్చు. వయోజన జనాభా, ఓటర్ల సంఖ్య మధ్య ఉన్న తేడాను అంగీకరించడం సబబు కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సవరణ ద్వారా ఈ వ్యత్యాసాన్ని తొలగించాలి. నిజానికి గతంలో యువ జనులలో ఓటరుగా నమోదైన వారి సంఖ్య 7.5శాతం కంటే తక్కువగా ఉండేది. ఉదాహరణకు 2014లో ఓటరుగా నమోదైన యువజనుల శాతం మొత్తం వయోజన జనాభాలో 5.2 శాతం మాత్రమే.

స్వచ్ఛందంగా ఓటరుగా నమోదు చేయించుకోనివారు భల్లా పేర్కొన్నట్టు 8.5శాతంగా ఉన్నారని అంగీకరించినప్పటికీ న్యాయవిరుద్ధంగా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనవారు ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 1 కోటీ 40 లక్షలు. సర్ ప్రథమ, ద్వితీయ దశలు అమలయిన తొమ్మిది రాష్ట్రాలలో కేవలం 70 లక్షల మంది మాత్రమే తుది ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురయ్యారన్న భల్లా వాదన సహేతుకమైనది కాదని యూపీ వాస్తవం స్పష్టం చేసింది. 2024లో ఉత్తరప్రదేశ్‌లో 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువజనులలో 40శాతం మంది ఓటరుగా నమోదు చేయించుకోలేదని భల్లా పేర్కొన్నారు. అయితే ఆ రాష్ట్రంలో ఓటరుగా నమోదు కాకపోవడానికి అనుమతించదగిన పరిమితిని ప్రామాణిక 8.5శాతం కంటే అధికం చేశారు. ఇదెలా సమర్థనీయం?

కొద్దివారాల క్రితం సుర్జిత్ భల్లా ఒక వ్యాసంలో సర్ తుది జాబితాల నుంచి ఒక ఓటు సంభావ్య తొలగింపు గురించి భావావేశంతో నిరసన తెలిపారు. తొలగింపునకు గురయ్యే అవకాశమున్న ఆ ఓటు ఆయనదే! మరి ఓటుహక్కుకు పూర్తిగా అర్హులయి ఉండి కూడా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురికావడమనేది చిన్న విషయంపై పెద్ద రభస ఎలా అవుతుంది?

# సంస్కరణలూ అవసరమే!

**అక్టోబర్ 21వ తేదీని 'వృత్తి నిర్వహణలో అమరులైన పోలీసువారి సంస్మరణ దినం'గా దేశమంతటా జరుపుకోవడం ఆనవాయితీ. నేడు పోలీసుల దుస్థితి చూస్తే హృదయం ద్రవిస్తుంది. ప్రాణాలను పణంగా పెట్టి ఎండనకా, వాననకా కరుడుగట్టిన దొంగలతో, నేరస్థులతో పోరాటాలు చేస్తుంటారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారినప్పుడు, జనం రాళ్లు విసిరినప్పుడు దెబ్బలు భరించాలి. ఒకవేళ ప్రాణ రక్షణలో భాగంగా కాల్పులు జరిపితే– హక్కుల సంఘాలు, పత్రికలు, న్యూస్ చానెళ్లు... పోలీసులను దుర్మార్గులుగా చిత్రీకరిస్తాయి. ఎంక్వయిరీలు, నిజ నిర్ధారణ కమిటీలు, కేసులు, శిక్షలు ఎదుర్కోక తప్పదు. అదే చట్ట వ్యతిరేక శక్తులు జరిపిన కాల్పుల్లో పోలీసులు మరణిస్తే ఇవేమీ కనబడవు, వినపడవు. విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న పోలీసు సిబ్బంది గురించి, వారి కుటుంబాల గురించి ప్రసారం చేయరు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అవినీతి ఉంది. కానీ అవినీతి పక్షపాతం, బంధుప్రీతి లేనిదెక్కడ? రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ట్రాన్స్‌పోర్ట్, ఎండోమెంట్స్, సేల్స్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్, ఎక్సైజ్... ఇలా ఏ డిపార్ట్‌మెంట్‌లో లేదు అవినీతి? ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణలోనూ పోలీసుల పాత్ర ప్రముఖంగా నిలిచింది. ఈ విషయంలో**



**వారి కృషి, పట్టుదల, నిరంతర శ్రమను మనసారా అభినందించాల్సిందే!**

'పోలీసులంటే ప్రభుత్వానికి కాపలాకాసే చౌకీదార్లు' అనే విధంగా ఉన్న ప్రభుత్వం మెంటాలిటీ మారేవరకు ఈ డిపార్ట్‌మెంట్‌పై నిందలు, అపనిందలు తప్పవు. అంతేకాదు, పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలంటే ముందు 'పోలీసులే గవర్నమెంట్... గవర్నమెంటే పోలీసులు' అనే ప్రజాదృక్పథం మారాలి. పోలీసులంటే గవర్నమెంట్‌కు కొమ్ముకాయడానికి నియామకమైన ఫోర్స్ కాదు. వీవీఐపీలకు బాడీగార్డులుగా ఉండడానికి నిర్దేశించిన సిబ్బంది కాదు. పోలీసు వ్యవస్థ అనేది ప్రజా సైన్యం. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం దీని విధి. ప్రభుత్వాన్ని, ప్రజల ఆస్తులనూ సంరక్షించడమే ఖాకీల లక్ష్యం. ప్రభుత్వ నియంత్రణ నుంచి పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను తప్పించి, స్వతంత్ర ప్రతిపత్తి గల ఒక ప్రత్యేక వ్యవస్థగా దానిని మలచాలి. పోలీసు సిబ్బంది కూరుకుపోయి ఉన్న అమానవీయ పరిస్థితుల నుంచి వారికి విముక్తి కల్పించాలి. ప్రజలే ''బెస్ట్ పోలీస్'' అవార్డును ఏర్పాటు చేసి, అర్హులకు ఇచ్చే ప్రక్రియ అన్ని గ్రామాల్లో ప్రారంభం కావాలి.

# సాకులు చెప్పకండి...

**రికామీగా తిరుగుతున్న నిరుద్యోగ యువకుణ్ని 'ఉద్యోగం ఎందుకు రాలేదు?' అని అడిగితే 'అవకాశాలు లేవు' అంటాడు. వ్యాపారం చేసి నష్టపోయినవారు 'మార్కెట్ బాగాలేదు' అంటారు. పరీక్ష తప్పిన విద్యార్థి 'పేపర్ టఫ్‌గా వచ్చింది' అని చెబుతాడు. ప్రతి ఓటమికీ ఒక సాకు, ప్రతి వైఫల్యానికీ ఒక కారణం మన దగ్గర సిద్ధంగా ఉంటుంది.నా బతుకింతే, ఇంతకు మించి నావల్ల కాదు... లాంటి మాటలను మనం తరచూ ఎక్కడో ఒకచోట వింటూనే ఉంటాం. సాధారణ మనిషి పరిస్థితిని చూసి భయపడతాడు, గొప్ప వ్యక్తి అదే పరిస్థితిని సవాలుగా తీసుకుంటాడు. పిల్లలందరికీ ఇష్టమైన మిక్కీ మౌస్ సృష్టికర్త వాల్ట్ డిస్నీ. ఆయన ఒకప్పుడు వార్తాపత్రికలో చిన్న ఉద్యోగం చేసేవారు. 'నీకు క్రియేటివిటీ లేదు' అంటూ అక్కడ ఉద్యోగం నుంచి తీసేశారు. అలా ఉద్యోగం పోగొట్టుకున్న వ్యక్తే తన ఊహలకు**




**రెక్కలు తొడిగి.. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన యానిమేషన్ సామ్రాజ్యాన్ని నిర్మించారంటే నమ్మగలరా? ఈ రోజు**

**డిస్నీ అంటేనే ఊహకు మారుపేరు.**

ప్రపంచ ప్రఖ్యాత హారర్ రచయిత స్టీఫెన్ కింగ్. మొదట్లో ఆయన రాసిన నవలలను చాలావరకు ప్రచురణ సంస్థలు తిరస్కరించాయి. విసిగిపోయి వాటిని చెత్తబుట్టలో పడేశారు కూడా. అప్పుడు ఆయన భార్య.. వాటిని తీసి మళ్లీ పంపమని ప్రోత్సహించింది. చివరికి ఒక కంపెనీ ఒప్పుకొంది. ఆ తర్వాత కింగ్ వెనుదిరిగి చూడలేదు. ఇప్పటివరకు ఆయన పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా 35 కోట్ల కాపీలకు పైగా అమ్ముడయ్యాయి. తిరస్కారం కింగ్‌ను మరింత బలవంతుణ్ని చేసింది. జురాసిక్ పార్క్ వంటి అద్భుత చిత్రాల దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్. సినిమా అంటే విపరీతమైన అభిమానం ఉన్న ఆయన ఫిల్మ్ స్కూల్లో చేరాలని ప్రయత్నిస్తే మూడుసార్లు సీటు నిరాకరించారు. పాఠశాల విద్యలో గ్రేడ్స్ సరిగా లేవని తిప్పి పంపారు. కానీ ఆయన సినిమాని వదులుకోలేదు. సొంతంగా షార్ట్ ఫిల్మ్స్ తీస్తూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈరోజు స్పీల్‌బర్గ్ హాలీవుడ్‌లోనే అత్యంత విజయవంతమైన దర్శకుడు.

వీరి ముగ్గురి జీవితాలు మనకు ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. వైఫల్యం శాశ్వతం కాదు, తిరస్కారం ముగింపు కాదు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని సాకు చెప్పి ఆగిపోతే, విజయం ఎప్పటికీ దూరంగానే ఉంటుంది. శక్తిమేరకు ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి. ప్రతికూలతలే కృషికి ఇంధనంగా మారాలి. వారు మనకన్నా తెలివి కలవాళ్లు, ధనవంతులు, పలుకుబడి ఉన్నవాళ్లు... ఇలాంటివన్నీ సాకులే. గెలవడానికి కావాల్సింది అవన్నీ కాదు, గెలిచితీరాలన్న పట్టుదల. ఒకసారి ఓడిపోయాక 'నా వల్ల కాదు' అనేయడం చాలా సులభం. కానీ అదే ఓటమి తర్వాత 'మళ్లీ ప్రయత్నిస్తా' అనడానికి గుండె ధైర్యం కావాలి. ఆ ధైర్యమే వారిని లెజెండ్స్‌ని చేసింది. ప్రయత్నిస్తే ఎవరినైనా విజేతల్ని చేస్తుంది.

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

గురువారం ⁞ 26.11.2026 ⁞ 01


## రాప్తాడులో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ సుయేష్ కుమార్

**- పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలి.. అధికారులకు సూచన**

**రాప్తాడు నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్**



రేపు జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాప్తాడు మండల కేంద్రంలో ఎన్నికల ఏర్పాట్లను అసిస్టెంట్ కలెక్టర్ సుయేష్ కుమార్ పరిశీలించారు. ఇందులో భాగంగా రాప్తాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవోతో కలిసి పోలింగ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది, రిజర్వ్ సిబ్బంది అందుబాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియలో ఎక్కడా లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని ఆదేశించారు.

# నాడు సామాజిక సేవ.. నేడు ప్రజాసేవ!





**- సేవా కార్యక్రమాలతో ప్రజల మనసు గెలిచి.. సర్పంచ్‌గా ఎన్నికై కొత్త బాధ్యతలు స్వీకరించిన బి.సి. ఇందిరారెడ్డి**

**- పర్యావరణ పరిరక్షణ నుంచి పేదల సంక్షేమం వరకు.. మహిళా సాధికారత నుంచి యువతకు ఉపాధి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు**

**- రూ.30 లక్షలతో హరితపల్లె కార్యక్రమం.. 100 మంది గర్భిణులకు ప్రతినెలా పౌష్టికాహారం.. 80 శాతం ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యం**

**బనగానపల్లె నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, సామాజిక సేవనే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగిన మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి  సతీమణి శ్రీమతి బి.సి. ఇందిరారెడ్డి తాజాగా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికై ప్రత్యక్ష ప్రజాసేవలోకి అడుగుపెట్టారు. నాడు వివిధ సంక్షేమ, సామాజిక కార్యక్రమాలతో ప్రజల ఆదరాభిమానాలను సంపాదించుకున్న ఆమె.. నేడు ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధికి మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం పొందారు.బనగానపల్లె నియోజకవర్గంలో పర్యావరణ పరిరక్షణ, మహిళా సంక్షేమం, విద్య, వైద్యం, నిరుద్యోగ యువతకు ఉపాధి, నిరుపేదలకు ఆర్థిక భరోసా వంటి అనేక కార్యక్రమాలను ఆమె వ్యక్తిగత చొరవతో చేపట్టారు. 'నా బనగానపల్లె  నా ఆరోగ్యం' కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, పట్టణంలో దాదాపు 80 శాతం మేర ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని తీసుకురావడంలో కృషి చేశారు. 'హరిత పల్లె మా బనగానపల్లె' కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి సుమారు రూ.30 లక్షల విలువైన మొక్కలను ప్రత్యేకంగా ఎంపిక చేసి తీసుకొచ్చి పట్టణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.మహిళలు, గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి నెలా 9వ తేదీన బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 100 మంది గర్భిణులకు తన సొంత నిధులతో ఉచిత పౌష్టికాహారం అందిస్తున్నారు. కైపా, సంకలాపురం, చెరువుపల్లి తదితర గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు నెలకు రూ.3,000 చొప్పున వ్యక్తిగత నిధులతో పెన్షన్ అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.విద్యార్థినుల సౌకర్యార్థం ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో రూ.2 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, బనగానపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సొంత ఖర్చులతో 35 బెంచీలు అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పట్టణంలోని ప్రభుత్వ మైదానంలో సొంత నిధులతో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి ఏటా ప్రత్యేక జాబ్  మేళాలు  నిర్వహిస్తున్నారు.పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను ప్రోత్సహిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా నూతన వస్త్రాలు పంపిణీ చేసి వారిని గౌరవిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు, బాలికల కోసం ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించి విజేతలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు వంటి బహుమతులు అందిస్తూ మహిళా సాధికారతకు ప్రోత్సాహం అందిస్తున్నారు.అలాగే BCJR వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు హాజరవుతూ, విషాద సమయాల్లో బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించి నైతికంగా, ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

**సామాజిక సేవకు ప్రజల మద్దతు తోడై..**

ఇప్పటివరకు వ్యక్తిగత చొరవతో, సామాజిక బాధ్యతగా చేపట్టిన సేవా కార్యక్రమాలకు ప్రజల ఆదరణ లభించగా, తాజా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నిక కావడం ఆమె సేవా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఇకపై గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా ముందుకు సాగనున్నారు.

# ఈవీఎం గోదాము భద్రతపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



**- పెండింగ్ భద్రతా వ్యవస్థ పరిశీలన....**

**- సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణపై ఆరా....**

**- నిబంధనల అమలులో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఆదేశం....**

**ధర్మవరం నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :**

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ధర్మవరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆయన గోదామును సందర్శించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాల భద్రతకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.

గోదాము వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా వ్యవస్థతోపాటు పోలీసు బందోబస్తును కలెక్టర్ పరిశీలించారు. గోదాము లోపల, వెలుపల అమర్చిన సీసీటీవీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న విధానాన్ని తనిఖీ చేశారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్ తలుపులకు ఏర్పాటు చేసిన సీళ్లను పరిశీలించి, భద్రతా సిబ్బంది నిర్వహిస్తున్న లాగ్‌బుక్, సందర్శకుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాము భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించకుండా విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, తహసీల్దార్ దేవరాజు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో తాగునీటి, డ్రైనేజీ సమస్యలకు
# శాశ్వత పరిష్కారం చూపిస్తాం

**- పెండింగ్ డ్రైనేజీ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం**

**- డైరెక్ట్ పంపింగ్ విధానానికి స్వస్తి పలికి రిజర్వాయర్లలో నిల్వ తర్వాతే పంపింగ్ చేయాలి**

**- ఎస్‌టీపీ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం**

**మచిలీపట్నం నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**



బందరు నగర వాసులను దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని, పనుల్లో జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులు, మెగా కాంట్రాక్టర్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నగరంలో తాగునీటి పంపిణీ వ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి తక్షణమే సరిచేయాలని సూచించారు. రీజోనింగ్ విధానంతో నీటి సరఫరాపై ఒత్తిడిని తగ్గించవచ్చని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా నీరు అందాల్సిన ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**డైరెక్ట్ పంపింగ్‌కు స్వస్తి.. రిజర్వాయర్ల ద్వారానే సరఫరా**

డైరెక్ట్ పంపింగ్ వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ముందుగా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసి, అక్కడి నుంచి నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సరఫరా చేయాలని మంత్రి సూచించారు. నగరంలోని ఆరు రిజర్వాయర్లకు ఒకే ప్రధాన లైన్ ద్వారా నీటిని అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి, చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్లలో లీకేజీలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, దెబ్బతిన్న పాత లైన్ల స్థానంలో అవసరమైన చోట కొత్త పైపులైన్లు వేయాలని ఆదేశించారు. ప్రస్తుత లైన్లకు మరమ్మతులు అవసరమైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. నీటి నిల్వలు అధికంగా ఉన్నప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు నీరు చేరేలా సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఎస్‌టీపీ పనుల్లో వేగం పెంచాలి**

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌టీపీ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మరిన్ని కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మెగా కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐదు మండలాల్లో
# పంచాయతీ పోరుకు సర్వం సిద్ధం!




**- 73 సర్పంచ్ స్థానాలకు నేడు పోలింగ్.. సాయంత్రానికే ఫలితాలు**

**- మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్.. అనంతరం ఓట్ల లెక్కింపు**

**శెట్టూరు, నవంబర్ 25 (అనంత జనశక్తి న్యూస్):**

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండలాల్లో గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసి ఆయా కేంద్రాలకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించారు.ఐదు మండలాల పరిధిలో మొత్తం 74 సర్పంచ్ స్థానాలు ఉండగా, ఒక స్థానం ఏకగ్రీవం కావడంతో మిగిలిన 73 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో 170 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అదేవిధంగా 812 వార్డు సభ్యుల స్థానాలకు గాను 80 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 732 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

**మండలాల వారీగా అభ్యర్థుల వివరాలు**

కళ్యాణదుర్గం మండలంలో 17 సర్పంచ్ స్థానాలకు 37 మంది, కంబదూరు మండలంలో 12 స్థానాలకు 26 మంది, శెట్టూరు మండలంలో 16 స్థానాలకు 38 మంది, కుందుర్పి మండలంలో 13 స్థానాలకు 36 మంది, బ్రహ్మసముద్రం మండలంలో 16 స్థానాలకు 33 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బ్రహ్మసముద్రం మండలంలో ఒక సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది.వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి కళ్యాణదుర్గం మండలంలో 22, కంబదూరులో 2, శెట్టూరులో 9, కుందుర్పిలో 2, బ్రహ్మసముద్రంలో 45 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా బ్రహ్మసముద్రం మండలంలో 45 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడం విశేషం.

**సాయంత్రానికే అభ్యర్థుల భవితవ్యం**

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. గురువారం ఉదయం ప్రారంభమయ్యే పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుంది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. దీంతో సాయంత్రానికే గ్రామ పంచాయతీల్లో విజయం ఎవరిని వరిస్తుందో తేలిపోనుంది.

# మాటిచ్చాం.. అభివృద్ధి చేసి చూపించాం

**- మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం .**

**- పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: మంత్రి సవిత**

**- మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్న మంత్రి సవిత**

**పెనుకొండ నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**



ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చి అభివృద్ధి చేసి చూపించామని, మాది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు.పెనుకొండ మండలంలోని మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో మంత్రి సవిత స్థానిక కూటమి నాయకులు నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలకు చేరుకున్న మంత్రి సవితమ్మకు గ్రామస్తులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. గత ఎన్నికల ప్రచార సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెప్పుకోవడానికి ఒక్క అభివృద్ధి పని కూడా లేదని విమర్శించారు. వైసీపీ నాయకులకు అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.గతంలో ఇదే నియోజకవర్గానికి చెందిన వ్యక్తి రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేసినా, నియోజకవర్గంలో ఒక్క రహదారిని కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే కూటమి అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మునిమడుగు గ్రామ సర్పంచ్ అభ్యర్థి జి. మల్లికార్జున, గుట్టూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి సూర్యనారాయణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.అనంతరం అమ్మవారిపల్లి గ్రామంలో పెనుకొండ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**- ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల...**

**- జట్లలో పట్టణానికి చెందిన ఆరుగురికి చోటు..**

**- ప్రతిభ చాటిన యువ క్రీడాకారులు...**

**ధర్మవరం నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :**



రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం పట్టణానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికై పట్టణానికి గర్వకారణంగా నిలిచారు. 12వ సీనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల జట్లలో ధర్మవరానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు స్థానం సంపాదించడం విశేషం. క్రీడారంగంలో తమ ప్రతిభను నిరూపించుకుంటూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురం పట్టణంలో నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు ఈ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జట్టుకు ధర్మవరానికి చెందిన నిక్కశ్రీ, యశస్విని, అలేఖ్య, వైష్ణవి ఎంపిక కాగా, బాలుర జట్టుకు వీర సంజయ్ కుమార్ రెడ్డి, లక్ష్మీ నరసింహ ఎంపికయ్యారు. ఈ నెల 22వ తేదీన అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తమ ఆటతీరుతో ప్రతిభ కనబరిచి జిల్లా జట్లలో చోటు దక్కించుకున్నారు. కఠినమైన పోటీలో ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించడం వారి క్రీడా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా సైతం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని, విజయాలతో ధర్మవరం పట్టణానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులు వేగవంతం చేసి
# నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి



**జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్.**

**అనంతపురం, నవంబర్ 25 :అనంత జనశక్తి న్యూస్**

రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులు వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం పామిడి మండలంలోని పామిడి గ్రామాన్ని సందర్శించి, మండలంలో జరుగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ట్రూథింగ్ పనులు మందకొడిగా సాగుతున్నందున, వాటిని వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శర్మిల, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు
# ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ చేయూత



- **మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి: సందీప్ బి.రెడ్డి**
- **తాలూకా స్థాయి మహిళా చర్చా వేదిక నిర్వహణ**

**మండికల్: నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

శ్రీక్షేత్ర ధర్మస్థళం పేదల పాలిట పుణ్యక్షేత్రమని, మహిళలకు పుట్టినిల్లులా అండగా నిలుస్తోందని చిక్‌బళ్లాపురం నియోజకవర్గ సామాజిక సేవకుడు, భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్ బి.రెడ్డి అన్నారు. ధర్మస్థళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుని స్వావలంబనతో కూడిన జీవితాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.చిక్‌బళ్లాపురం తాలూకా పెరేసంద్ర క్రాస్‌లోని శ్రీ ఓంకారేశ్వర సభాభవన్‌లో శ్రీక్షేత్ర ధర్మస్థళ గ్రామాభివృద్ధి పథకం బి.సి. ట్రస్ట్, మహిళా జ్ఞాన వికాస కార్యక్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన తాలూకా స్థాయి మహిళా చర్చా వేదికను సందీప్ బి.రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా సాధికారతకు ధర్మస్థళ గ్రామాభివృద్ధి పథకం విశేష కృషి చేస్తోందని తెలిపారు. మహిళల ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన, కుటుంబ అభివృద్ధికి దోహదపడే అనేక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా సంస్థ జిల్లా సంచాలకుడు చిదానంద మాట్లాడుతూ.. పూజ్య డాక్టర్ డి. వీరేంద్ర హెగ్గడే మార్గదర్శకత్వంలో ధర్మస్థళ గ్రామాభివృద్ధి పథకం గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అభ్యున్నతికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.

## విద్యార్థి దశ నుంచే చారిత్రక వారసత్వంపై
# అవగాహన పెంపొందించాలి



## విద్యార్థి దశ నుంచే చారిత్రక వారసత్వంపై
# అవగాహన పెంపొందించాలి

- **పురాతన ఆలయాలు, కోటల నిర్మాణ శైలిపై భావితరాలకు మౌలిక పాఠాలు అవసరం**
- **మైసూరు విశ్రాంత పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ విజయ్ కుమార్**

**తిరుపతి నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థి దశ నుంచే మన దేశ చారిత్రక సంపద, పురాతన ఆలయాలు, కోటలు, చారిత్రక కట్టడాలు, ప్రాచీన వస్తువుల విశిష్టతపై అవగాహన కల్పించాలని మైసూరుకు చెందిన విశ్రాంత పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ విజయ్ కుమార్ సూచించారు. మన పూర్వీకుల నిర్మాణ నైపుణ్యం, శిల్పకళా వైభవం, చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ మేరకు వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరుకు చెందిన ప్రముఖ రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ బుధవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జాదవ్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో తిరుపతి పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు రజిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాదవ్ విజయ్ కుమార్ పురావస్తు శాస్త్రంలో తనకున్న సుదీర్ఘ అనుభవాలను, చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను వివరించారు. మన ఘనమైన చరిత్రను, వారసత్వ సంపదను కాపాడుతూ భవిష్యత్తు తరాలకు అందించడంలో పురావస్తు నిపుణులు, అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.అనుభవజ్ఞులైన నిపుణులు ముందుకొచ్చి యువతలో చారిత్రక పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాలని, భావితరాలను చరిత్ర పరిశోధనలో నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో చారిత్రక కట్టడాల పరిరక్షణ, పురాతన ఆలయాల నిర్మాణ విశేషాలు, ప్రాంతీయ చరిత్ర పరిశోధనలు, వారసత్వ సంపదను భద్రపరిచే అంశాలపై ఆసక్తికరమైన చర్చ జరిగింది.

# ఊబకాయాన్ని నిర్లక్ష్యం చేస్తే
# అనారోగ్య సమస్యలు తప్పవు

- **ఆరోగ్యకరమైన జీవనశైలితోనే నివారణ సాధ్యం**
- **మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఫ్యాటీ లివర్‌కు ఊబకాయం ప్రధాన ముప్పు**
- **ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, నిద్రలేమి ప్రధాన కారణాలు**
- **అవసరమైతే మందులు, బేరియాట్రిక్ శస్త్రచికిత్సతోనూ చికిత్స**

**డాక్టర్ టి. రాఘవేంద్ర చౌదరి సీనియర్ కన్సల్టెంట్ జనరల్ & మినిమల్ యాక్సెస్ సర్జరీ కిమ్స్ సవీర, అనంతపురం.**

**అనంతపురం నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

ఊబకాయం (అధిక బరువు) అనేది కేవలం శరీర ఆకృతికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు దారితీసే తీవ్రమైన ఆరోగ్య సమస్య. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల చిన్న వయసు నుంచి పెద్దల వరకు చాలామంది ఊబకాయం బారిన పడుతున్నారు. దీనివల్ల మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, ఫ్యాటీ లివర్, కీళ్ల సమస్యలు వంటి అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల ఊబకాయాన్ని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.

**ఊబకాయాన్ని ఎలా గుర్తించాలి?**

శరీరంలో అవసరానికి మించి కొవ్వు పేరుకుపోయి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడాన్ని ఊబకాయంగా పరిగణిస్తారు. సాధారణంగా ఎత్తు, బరువు ఆధారంగా బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) లెక్కించి అధిక బరువును గుర్తిస్తారు. అయితే భారతీయుల్లో, ముఖ్యంగా ఆసియా ప్రజల్లో తక్కువ బీఎంఐ ఉన్నప్పటికీ పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల మధుమేహం, గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది. అందువల్ల బీఎంఐతో పాటు నడుము చుట్టుకొలత, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలను కూడా పరిశీలించాలి.

**ఎందుకు వస్తుంది?**

అధిక కేలరీలు ఉండే ఆహారం, జంక్ ఫుడ్, నూనెలో వేయించిన పదార్థాలు, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకోవడం, సమయానికి భోజనం చేయకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం ఊబకాయానికి ప్రధాన కారణాలు. ఎక్కువసేపు టీవీ, మొబైల్ ఫోన్ల ముందు గడపడం, నిద్రలేమి, ఒత్తిడి కూడా ప్రభావం చూపుతాయి. కొందరిలో జన్యుపరమైన కారణాలు, హార్మోన్ల అసమతుల్యత, కొన్ని మందుల వాడకం వల్ల కూడా బరువు పెరిగే అవకాశం ఉంటుంది.

**అనేక వ్యాధులకు దారితీస్తుంది**

ఊబకాయం ఉన్నవారిలో టైప్2 మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, నిద్రలో శ్వాసకు ఆటంకం కలిగించే స్లీప్ అప్నియా, మోకాళ్లు, ఇతర కీళ్ల నొప్పులు, కొన్ని రకాల క్యాన్సర్లు, సంతానలేమి, హార్మోన్ల సమస్యలు కూడా రావచ్చు. మానసిక ఒత్తిడి, ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి సమస్యలకూ దారితీయవచ్చు. పిల్లల్లోనూ ఊబకాయం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. చిన్నతనంలో అధిక బరువు ఉన్నవారు పెద్దయ్యాక కూడా ఊబకాయంతో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**జీవనశైలిలో మార్పులు తప్పనిసరి**

ఊబకాయాన్ని నివారించడానికి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, తగినంత ప్రొటీన్లు ఉన్న సమతుల ఆహారం తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, తీపి పానీయాలు, శుద్ధి చేసిన పిండి పదార్థాలను తగ్గించాలి. ఒకేసారి ఎక్కువగా తినకుండా పరిమిత మోతాదుల్లో ఆహారం తీసుకోవాలి. వారానికి కనీసం 150 నుంచి 300 నిమిషాల పాటు వేగంగా నడవడం, సైక్లింగ్, ఈత వంటి వ్యాయామాలు చేయాలి. రోజుకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. ఎక్కువసేపు కూర్చుని ఉండకుండా మధ్యమధ్యలో లేచి నడవాలి. క్రమం తప్పకుండా బరువు, నడుము కొలత, రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను పరీక్షించుకోవాలి.

**మందులు, శస్త్రచికిత్సతోనూ చికిత్స**

ఊబకాయం దీర్ఘకాలిక సమస్య కావడంతో కేవలం తక్కువ ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం మాత్రమే కొందరిలో సరిపోకపోవచ్చు. అలాంటి వారికి వారి ఆరోగ్య పరిస్థితి, బీఎంఐ, ఇతర అనారోగ్య సమస్యలను బట్టి వైద్యులు ప్రత్యేక ఆహార ప్రణాళిక, వ్యాయామం, ప్రవర్తనా మార్పులకు సంబంధించిన కౌన్సెలింగ్, అవసరమైతే బరువు తగ్గించే మందులను సూచిస్తారు. తీవ్రమైన ఊబకాయం



ఉన్నవారికి లేదా ఊబకాయంతోపాటు మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారికి బేరియాట్రిక్ అండ్ మెటబాలిక్ సర్జరీ ఉపయోగపడుతుంది. ల్యాపరోస్కోపిక్ స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ, గ్యాస్ట్రిక్ బైపాస్ వంటి శస్త్రచికిత్సల ద్వారా అధిక బరువును గణనీయంగా తగ్గించవచ్చు. కొందరిలో మధుమేహం, అధిక రక్తపోటు, స్లీప్ అప్నియా వంటి సమస్యలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. చిన్న కోతలతో చేసే ఈ శస్త్ర చికిత్సల వల్ల నొప్పి తక్కువగా ఉండటంతో పాటు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇవి అందరికీ అవసరం ఉండదు. వైద్యుల సమగ్ర పరిశీలన అనంతరం అర్హులైన వారికే సూచిస్తారు. శస్త్రచికిత్స తర్వాత కూడా జీవితాంతం ఆహార నియమాలు, వైద్య పర్యవేక్షణ పాటించాలి.

**అధిక బరువున్నవారిని అవమానించకూడదు**

ఊబకాయంతో బాధపడుతున్నవారిని విమర్శించడం, అవమానించడం కాకుండా వారికి కుటుంబ సభ్యులు, సమాజం అండగా నిలవాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలి. బయట ఆటలు, వ్యాయామాలకు ప్రోత్సహించాలి. ఊబకాయం వల్ల మధుమేహం, గుండె జబ్బులు వంటి సమస్యలు వచ్చే వరకు వేచి చూడకుండా ముందుగానే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. బరువు తగ్గడమే లక్ష్యంగా కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రతి ఒక్కరి ప్రాధాన్యంగా ఉండాలి.

## తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల
# పోలింగ్, కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

- **నేడు జిల్లాలోని 13 మండలాలలో తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్**
- **అదే రోజున పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియ**
- **జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అన్ని కోణాల్లో పటిష్ట భద్రతా చర్యలు**
- **పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు**
- **అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా**
- **సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

**అనంతపురం నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

ఈనెల 26న జిల్లాలోని 13 మండలాలలో తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, అదే రోజున కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు అన్ని కోణాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించనున్నారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, రూట్లు, సమస్యాత్మక ప్రాంతాలు, విధుల పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.



పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిని స్పష్టంగా గుర్తించి, ఆ పరిధిలోకి అనుమతి లేని వ్యక్తులు, వాహనాలను అనుమతించరాదని, వాహనాల పార్కింగ్‌ను నిర్దేశిత పరిధికి వెలుపల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఆంక్షలు అమలు చేస్తూ... ప్రచారం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్ సిబ్బంది తమకు కేటాయించిన మార్గాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సైరన్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సూచనలు చేస్తూ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు.విధులకు హాజరయ్యే ప్రతి పోలీసు సిబ్బంది నీట్‌గా యూనిఫాం ధరించి, లారీ, విజిల్, అవసరమైన అత్యవసర సంప్రదింపు నంబర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమబద్ధమైన క్యూ లైన్లలో పంపిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఓటర్లు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురాకుండా సహకరించాలని కోరారు.అమల్లో ఉన్న ఎన్నికల నియమావళి, పోలీసు యాక్ట్ 30, సెక్షన్ 163 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా గుంపులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సిబ్బంది, పోలింగ్ సామగ్రి తరలింపునకు తగిన భద్రత కల్పించాలని తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# కాకినాడ హార్బర్‌కు సురక్షితంగా చేరుకున్న మత్స్యకార బోటు

- **ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటులోని ఏడుగురు క్షేమం**
- **సకాలంలో స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయం**
- **ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం ముమ్మర గాలింపు**
- **కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ.. బంగ్లాదేశ్, మయన్మార్ సహకారం కోరేందుకు చర్యలు**
- **మత్స్యకారుల ప్రాణరక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం**
- **రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, నవంబర్ 25:అనంత జనశక్తి న్యూస్**

కాకినాడ జిల్లా యేటిమొగ నుంచి చేపల వేటకు వెళ్లి ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటు సురక్షితంగా కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకోవడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డ్రైవర్‌తో సహా ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావడం వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. యేటిమొగకు చెందిన సెరు రామలక్ష్మి పేరుతో నమోదైన యాంత్రిక మత్స్యకార బోటు (INDAP E2MM220) ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉప్పాడ-తుని తీరంలోని కృష్ణాపురం సమీపంలో నిలిచిపోయిందని వివరించారు. తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోటు నుంచి డ్రైవర్ దమ్ము అప్పారావు సమాచారం అందించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారన్నారు. అత్యవసర ఫోన్ కాల్ అందిన వెంటనే స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలోనూ వాకలపూడి ఇన్‌స్పెక్టర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా కోస్ట్‌గార్డ్, నౌకాదళ అధికారులకు సమాచారం చేరవేయడంతో పాటు మత్స్యశాఖతో సమన్వయం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. సముద్రపు నీటి లోతు తక్కువగా ఉండటంతో భారీ నౌకల రాకకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, బోట్ల యజమానుల సంఘం సహకారంతో సహాయక ప్రయత్నాలు చేపట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో వేగంగా స్పందించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

**ఏడుగురి కోసం ముమ్మర గాలింపు**

మరోవైపు కాకినాడ జిల్లా ఉప్పాడలోని సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 4న రెండు బోట్లలో పారాదీప్ వైపు చేపల వేటకు వెళ్లగా, ఒక బోటు 18న తిరిగి వచ్చిందన్నారు. మరో బోటులోని మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో 19న ఫిర్యాదు అందిందని, అప్పటి నుంచి సంబంధిత శాఖల సమన్వయంతో గాలింపు కొనసాగుతోందని వివరించారు. గల్లంతైన మత్స్యకారుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశామని మంత్రి తెలిపారు. వారి ఆచూకీ గుర్తించేందుకు అవసరమైన సహకారం కోరడంతో పాటు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సముద్ర జలాల వైపు వెళ్లి ఉండే అవకాశాలను కూడా పరిశీలిస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ ద్వారా ఆయా దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత తీర రక్షక దళం, నౌకాదళం, ఒడిశా అధికారులు, రాష్ట్ర మత్స్యశాఖ సమన్వయంతో గాలింపును మరింత వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని మంత్రి స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లే ముందు బోట్ల ఇంజిన్లు, ట్రాన్స్‌పాండర్లు, సమాచార వ్యవస్థలు, ఇతర రక్షణ పరికరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు.మత్స్యకారుల ప్రాణరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. ఒక బోటులోని ఏడుగురు క్షేమంగా తిరిగి రావడం సంతోషకరం. గల్లంతైన మరో ఏడుగురిని కూడా సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రయత్నాలు చేస్తాం. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలి. ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.



# వృద్ధులు, దివ్యాంగుల ఇంటికే రేషన్ సరుకులు..

- **ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పంపిణీ**
- **65 ఏళ్లు పైబడిన 77,054 మంది కార్డుదారులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు**

**అనంతపురం నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన బియ్యం కార్డుదారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేయనుంది. ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సంబంధిత చౌకధరల దుకాణాల డీలర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కేటాయించిన సరుకులను అందజేయనున్నారు.జిల్లాలో 65 ఏళ్లు పైబడిన 77,054 మంది బియ్యం కార్డుదారులతో పాటు దివ్యాంగులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కార్డుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సంయుక్త కలెక్టర్ సి. విష్ణుచరణ్ కోరారు. అర్హులైన కార్డుదారులు రేషన్ సరుకుల కోసం చౌకధరల దుకాణాల వద్దకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.చౌకధరల దుకాణాల డీలర్లు తమ బాధ్యతగా అర్హులైన కార్డుదారుల ఇళ్లకు వెళ్లి తప్పనిసరిగా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపిణీలో ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా కలెక్టరేట్‌లోని నియంత్రణ కేంద్రం 8500292992 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అలాగే, జిల్లాలోని తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్లు తమ పరిధిలోని చౌకధరల దుకాణాల ద్వారా జరిగే సరుకుల పంపిణీని నిరంతరం పర్యవేక్షించాలని సంయుక్త కలెక్టర్ సూచించారు.వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కల్పించిన ఇంటివద్దకే రేషన్ పంపిణీ సదుపాయాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

**- బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులు ఎదగాలి: ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ బి. అనిత**

**అనంతపురం: నవంబర్ 25: అనంత జనశక్తి న్యూస్**



శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతిరావు పూలే భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ కార్యక్రమానికి ఎస్కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్. నాగరాజు అధ్యక్షత వహించగా, విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ బి. అనిత ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత న్యాయశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ ఈ. విజయకుమార్ ముఖ్య వక్తగా ప్రసంగించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని, పౌరుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయానికి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు పౌరులుగా తమ విధులను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు.రెక్టార్ ప్రొఫెసర్ బి. అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని నిత్యజీవితంలో పాటించాలని, విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో కూడిన ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ముఖ్య వక్త ప్రొఫెసర్ ఈ. విజయకుమార్ రాజ్యాంగ దినోత్సవ చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ సూత్రాల అమలు ఎంతో అవసరమని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మానవ హక్కుల వేదిక ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి. వెంకట రమణ సమన్వయకర్తగా వ్యవహరించగా, డాక్టర్ రమ్య రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. చివరగా ఆమె వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం, పౌర బాధ్యతలపై చైతన్యం పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేసింది.

# కొండపల్లి బొమ్మలకు పూర్వవైభవం..



**- 420 మంది కళాకారులకు మెరుగైన ఉపాధి!**

**- రూ.20 లక్షలతో ప్రత్యేక ప్రాజెక్టుకు నీతి ఆయోగ్ ఆమోదం**

**కొండపల్లి నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

సంప్రదాయ కొండపల్లి చెక్కబొమ్మల కళకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు, కళాకారులకు మెరుగైన ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం కింద కొండపల్లి బొమ్మల పునరుజ్జీవనం, ప్రోత్సాహానికి రూ.20 లక్షల ప్రాజెక్టుకు ఇటీవల ఆమోదం లభించడం కీలక ముందడుగని పేర్కొన్నారు.బుధవారం కొండపల్లిలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, బొమ్మల తయారీ విధానం, కళాకారుల నైపుణ్యాలు, సంప్రదాయ కళ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా కొండపల్లి బొమ్మల తయారీపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 420 మంది కళాకారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సంప్రదాయ కళను కాపాడటంతో పాటు, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కళాకారుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.కొండపల్లి బొమ్మలకు ప్రత్యేక గుర్తింపు కల్పించేలా బ్రాండింగ్, పర్యావరణహిత ప్యాకేజింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, మెరుగైన మార్కెట్ అనుసంధానంపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. తద్వారా దేశవ్యాప్తంగా కొండపల్లి బొమ్మలకు మరింత ఆదరణ పెరగడంతో పాటు కళాకారుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తరతరాలుగా కొనసాగుతున్న కొండపల్లి చెక్కబొమ్మల కళను భావితరాలకు అందించడంతో పాటు, కళాకారుల జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఓటు.. మన శ్రీకాకుళం భవిష్యత్తు.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి!

**- శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట**

**- డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం**

**- ఓటర్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి**

**-కోటబొమ్మాళి, నవంబర్ 25 , అనంత జనశక్తి న్యూస్**

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. రేపు (గురువారం) జరగనున్న శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్థానిక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి కోరారు. శ్రీకాకుళం నగర అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందిన గ్రామాలు, పట్టణాలే స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి బలమైన పునాదులని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.శ్రీకాకుళం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను ప్రజలు తమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎన్నుకోవాలని మంత్రి కోరారు.



# కటారుపల్లిలో భూముల రీసర్వే ప్రారంభం



**- సర్వే నంబర్ 1 నుంచి పనులు ప్రారంభించిన తహసీల్దార్ నరసింహులు**

**గాండ్లపెంట, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమం శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలో బుధవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నరసింహులు సర్వే నంబర్ 1 నుంచి రీసర్వే పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామంలోని భూముల వివరాలు, సర్వే నంబర్లు, పొలాల హద్దులు, రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల వాస్తవ పరిస్థితులను రికార్డులతో సరిపోల్చేలా క్షేత్రస్థాయి నిర్ధారణ ప్రక్రియను చేపట్టారు.రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని తహసీల్దార్ నరసింహులు సిబ్బందికి సూచించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమికి సంబంధించిన పత్రాలు, రెండు రంగుల ఫొటోలు, ఆధార్ కార్డు ధ్రువీకరణ పత్రం, సెల్‌ఫోన్ నంబర్ వివరాలతో కూడిన జిరాక్స్ ప్రతులను సంబంధిత వీఆర్వో లేదా గ్రామ రెవెన్యూ సహాయకులకు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు దాసరి వెంకటరమణ, క్రిష్టప్ప, అమానుల్లా జాఫర్, సీనియర్ సహాయకులు, గ్రామ సర్వేయర్ శిరీష, గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# బియ్యం ధరలపై జాయింట్ కలెక్టర్ కొరడా!

**- హోల్‌సేల్ దుకాణాలు, ధరణి బియ్యం కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు**

**- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు.. ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్**

**ధర్మవరం, నవంబర్ 25 ,అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో బియ్యం ధరల నియంత్రణతో పాటు వినియోగదారులకు పారదర్శకంగా నిత్యావసర సరుకులు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం ధర్మవరం పట్టణంలోని రెండు ప్రముఖ హోల్‌సేల్ దుకాణాలతో పాటు ధరణి బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని బియ్యం నిల్వలు, ధరలు, నాణ్యత, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 18 (20112026) ప్రకారం జిల్లాలోని సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, చిన్న కిరాణా దుకాణాల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం ఎదుట వినియోగదారులకు కనిపించేలా బియ్యం రకాల వారీగా ధరల పట్టిక, నిల్వల వివరాల బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా, అధిక ధరలకు బియ్యం విక్రయించినా, అక్రమంగా నిల్వలు ఉంచినా సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలు ఇవే..**

జిల్లాలోని వ్యాపారులందరూ కింది ధరలకే బియ్యం విక్రయించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

బీపీటీ3291 (సోనా) - కిలో రూ.66

బీపీటీ5204 (సాంబా) - కిలో రూ.66

కేఎన్ఎం - కిలో రూ.66

హెచ్ఎంటీ - కిలో రూ.76

ఆర్ఎన్ఆర్ - కిలో రూ.76

జై శ్రీరామ్ - కిలో రూ.82

**- ఎంటీయూ సాధారణ రకాలు – కిలో రూ.47**

**ధరణి బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ పట్టణాలతో పాటు ఇతర ప్రత్యేక కేంద్రాల్లోనూ ఈ విక్రయాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వినియోగదారులు వెంటనే జిల్లా పౌరసరఫరాల శాఖ కంట్రోల్ రూమ్ నంబర్ 08555288566కు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీల్లో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణ రెడ్డి, ధర్మవరం తహసీల్దార్ దేవరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 28న బుక్కపట్నంలో మెగా జాబ్ మేళా

**- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ**

**- అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.**

**- శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,నవంబర్ 25:అనంత జనశక్తి న్యూస్**




శ్రీ సత్యసాయి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ (APSSDC) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నంలో గల శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నవంబర్ 28 శనివారం ఉదయం 9:00 గంటల నుంచి ఈ మెగా జాబ్ మేళా ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో వివిధ ప్రముఖ కార్పొరేట్ మరియు పారిశ్రామిక కంపెనీలు పాల్గొని, అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు.ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా తమ అర్హతలకు తగిన కంపెనీలను ఎంపిక చేసుకుని, అధికారిక 'నైపుణ్యం' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.రిజిస్ట్రేషన్ కోసం https://naipunyam.ap.gov.in/user-registration లింక్‌ను సందర్శించాలి.జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ దుస్తులు ధరించి రావాలి.ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు తమ బయోడేటా కాపీలు, పదవ తరగతి నుండి ఉన్నత విద్య వరకు గల విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్ మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను వెంట తీసుకురావాలి.జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నంబర్ : భారతి - 79815 41994.

# తలుపుల మండలంలో నాయకుల రాజకీయ రంగుల మార్పు!

**- సొంత పంచాయతీలో ఒక పార్టీకి మద్దతు.. పక్క పంచాయతీలో మరో పార్టీకి అనుకూలం!**

**- నాయకుల ద్వంద్వ వైఖరిపై గ్రామగ్రామాన చర్చ.. అయోమయంలో ఓటర్లు**

**తలుపుల, నవంబర్ 25 ,అనంత జనశక్తి న్యూస్**

తలుపుల మండల రాజకీయాల్లో నాయకుల వైఖరి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది. సొంత పంచాయతీలో ఒక రాజకీయ పార్టీకి మద్దతుగా నిలుస్తూ, పక్క పంచాయతీలో మరో పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఒకే మండలంలో, ఒకే నాయకుడు వేర్వేరు పంచాయతీల్లో భిన్నమైన రాజకీయ వైఖరులు ప్రదర్శిస్తున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.సొంత గ్రామంలో ఒక పార్టీ జెండా పట్టుకుని తిరిగే నాయకులు, పక్క గ్రామానికి వెళ్లగానే మరో పార్టీ నాయకులతో కలిసి కనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అసలు వీరి రాజకీయ విధేయత ఏ పార్టీకి? ప్రజల కోసం పనిచేస్తున్నారా? లేక స్థానిక అవసరాలకు అనుగుణంగా రాజకీయ వైఖరిని మార్చుకుంటున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.రాజకీయాల్లో పార్టీలు మారడం, నాయకులు తమ నిర్ణయాలను మార్చుకోవడం సహజమే అయినప్పటికీ, పంచాయతీని బట్టి రాజకీయ వైఖరి మారుతోందనే ఆరోపణలు ఓటర్లలో సందేహాలకు కారణమవుతున్నాయి. ఒక గ్రామంలో ఒక విధంగా, మరో గ్రామంలో మరో విధంగా వ్యవహరిస్తున్న నాయకుల తీరుపై గ్రామాల్లో చర్చలు సాగుతున్నాయి.ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నాయకుల రాజకీయ వ్యవహారశైలి ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ సిద్ధాంతాలు, రాజకీయ విధేయత గురించి మాట్లాడే నాయకులు క్షేత్రస్థాయిలో తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అవసరానికి తగ్గట్టుగా రాజకీయ రంగులు మారుస్తున్నారా? లేక




గ్రామాలవారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా? అన్నది ఇప్పుడు తలుపుల మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఏదైనా నాయకుల మాటల కంటే వారి ఆచరణను గమనిస్తున్నామని పలువురు ఓటర్లు వ్యాఖ్యానిస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.

# సీనియర్ సిటిజన్లకు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు

**- ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించిన ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్**

**రాజుపాలెం, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్:**




ప్రస్తుత కాలంలో మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ సూచించారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోట నెమలి గ్రామంలోని రామాలయం సమీపంలో బుధవారం 'ఇంటింటికి ఆయుర్వేదం.. ఇంటింటికి యోగా' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉన్నతాధికారులు రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గ్రామస్తులకు, ముఖ్యంగా వృద్ధులకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించారు.కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు పీచు పదార్థాలు అధికంగా ఉండే సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. సీజనల్ కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, పెరుగుకు బదులుగా మజ్జిగ తీసుకోవడం మంచిదని వివరించారు.అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో తగిన జాగ్రత్తలతో 15 నిమిషాల పాటు ఎండలో గడపాలని, ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.యోగ ఉపాధ్యాయులు జి.నరసింహారావు, ఎస్.వెంకటరమణ గ్రామస్తులకు యోగా, ప్రాణాయామం, ధ్యాన పద్ధతులను ప్రత్యక్షంగా నేర్పించారు. అనంతరం బలహీనత, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలకు సంబంధించి అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రత్నారెడ్డి, నరసింహారావు, కోటేశ్వరరావు, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, రాములమ్మ, నాగరత్నమ్మ, బుర్రి నాగయ్య, అత్తమ్మ తదితరులతో పాటు ఆయుష్ సిబ్బంది ఎస్. లక్ష్మీనారాయణ (కాంపౌండర్) పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ పై స్టేస్ 2 అధికారులకు అవగాహన




తలుపుల నవంబర్ 25అనంత జనశక్తి న్యూస్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కే. నసీమా సూచించారు.మండల కేంద్రంలోని స్థానిక మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో బుధవారం 17 గ్రామ పంచాయతీలకు చెందిన స్టేజ్ 2 అధికారులకు పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నసీమా మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగులు ఓటు హక్కును కోల్పోకుండా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులైన ఉద్యోగులు ఈ నెల 26, 27 తేదీల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

# రాప్తాడులో ఎన్నికల సామగ్రి పంపిణీ




రాప్తాడు నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండలంలో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ నేపథ్యంలో రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బందికి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామగ్రిని అందజేశారు.అనంతరం సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సంబంధిత సామగ్రితో ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పర్యవేక్షణ చేపట్టారు రేపు ఉదయం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి సిబ్బంది ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న డీకే



- చిరునవ్వుతో పలకరిస్తూ.. అభివృద్ధి హామీతో ముందుకు
- తలుపుల లో డీకే బాబు ప్రచారం

తలుపుల నవంబర్ 25అనంత జనశక్తి న్యూస్

ప్రజలతో మమేకమవుతూ. ప్రతి ఇంటి గడప తొక్కుతూ. ఆప్యాయతతో ఓటర్లను పలకరిస్తూ తలుపుల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి చింతకుంట కృష్ణారెడ్డి (డీకే బాబు) ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు.తలుపుల మేజర్ పంచాయతీ పరిధిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం ఉత్సాహభరితంగా సాగింది. ఎగువపేట, దేవళం వీధి, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకున్నారు.చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ, వారి ఆదరాభిమానాలను పొందుతూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా డీకే బాబు మాట్లాడుతూ తనకు ఒక అవకాశం కల్పించి ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.సర్పంచ్‌గా అవకాశం ఇస్తే తలుపుల మేజర్ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, పంచాయతీ రూపురేఖలు మారేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పదవులు ఆశించడం కంటే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే ముఖ్యమనే భావనతో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన సాగిస్తున్న ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంటోంది. తమ సమస్యలను నేరుగా వింటూ, చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు సాగుతున్న అభ్యర్థికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.

# జి పెద్ద తండా అభివృద్ధి లక్ష్యంగా.. బుక్కే నారాయణ నాయక్ ప్రచారం.

గాండ్లపెంట, నవంబర్, 25, అనంత జనశక్తి న్యూస్,

మండల పరిధిలోని పెద్దతండా గ్రామపంచాయతీలో కూటమి బలపరిచిన సర్పంచి అభ్యర్థి బుక్కే నారాయణ నాయక్ బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు సభ్యులు, కూటమి నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు మద్దతు తెలిపి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు ఈ సందర్భంగా నారాయణ నాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆదరణతో సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ నాయక్, కృష్ణ నాయక్, ఎన్నారై కృష్ణ నాయక్, నాగభూషణ, రామచంద్ర నాయక్, రెడ్డి నాయక్, రవీంద్ర నాయక్, ఫకీర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# తలుపుల మేజర్ పంచాయతీలో హోరెత్తిన కూటమి ఎన్నికల ప్రచారం

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యటనకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ – అనూహ్య స్పందనతో ఉత్సాహంగా సాగిన ప్రచారం

తలుపుల నవంబర్25,అనంత జనశక్తి న్యూస్



మేజర్ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తలుపుల మేజర్ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఎమ్మెల్యే పర్యటనకు గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజల ఆదరణ, ఆప్యాయత వెల్లువెత్తింది. ప్రచార కార్యక్రమానికి లభించిన అనూహ్య స్పందనతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ప్రతి ఇంటి తలుపు తడుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే , వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ, గ్రామ అభివృద్ధి పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ప్రజల ఆశీర్వాదం కోరారు.ఈ సందర్భంగా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి శ్రీ ఉబ్బర రఘునాథ రెడ్డికి, వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే విస్తృత ప్రచారం నిర్వహించారు. తలుపుల గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతుడు, మచ్చలేని వ్యక్తిత్వం కలిగిన శ్రీ ఉబ్బర రఘునాథ రెడ్డికి గ్రామ ప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తలుపుల గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కూటమి అభ్యర్థుల విజయం ఎంతో కీలకమని పేర్కొంటూ, సర్పంచ్ అభ్యర్థి శ్రీ ఉబ్బర రఘునాథ రెడ్డి కత్తెర గుర్తుపై ఓటు వేసి, వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు మరీమరీ విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో తలుపుల మేజర్ పంచాయతీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.

తలుపుల మేజర్ పంచాయతీలో ఎమ్మెల్యే నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి లభించిన విశేష ఆదరణ, అనూహ్య స్పందన ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. ప్రజల భాగస్వామ్యం, కూటమి నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో ప్రచారం విజయవంతంగా కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో తలుపుల మండల కన్వీనర్ మేడా శంకర్ ప్రసాద్ , జై చంద్ర, ముబారక్, వీర భార్గవ్ రెడ్డి,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా ప్రజల మద్దతు కూటమికే

- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగవంతం
- పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించండి
- మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ షేక్ బుర్హానుద్దీన్

బనగానపల్లె నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్




ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లోనూ, బ్యాలెట్ల ద్వారా జరుగుతున్న ఎన్నికల్లోనూ ప్రజలు కూటమి పార్టీలకే మద్దతు తెలుపుతున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ షేక్ బుర్హానుద్దీన్ అన్నారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్, నగర పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా పనిచేసిన విధంగానే రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కలిసి పనిచేస్తాయని తెలిపారు.

**కూటమిని బలపరచండి.. అభివృద్ధికి బాటలు వేయండి**

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే అన్ని దశల్లోనూ అభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులను ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ హయాంలో రిగ్గింగ్‌లు, దాడులు, దౌర్జన్యాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు.రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటున్నారని అన్నారు. 40 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో వినియోగించుకోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.2024లో ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమి పార్టీలను గెలిపించిన విధంగానే, ప్రస్తుతం బ్యాలెట్ల ద్వారా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. రేపు జరగనున్న పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాయని, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా చేరుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలబెట్టామని, సామాజిక సమీకరణాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామని వివరించారు.వైసీపీ హయాంలో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 16,800 మంది రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయారని విమర్శించారు. ప్రస్తుతం 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తే, వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని అన్నారు. అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ పరంగా 40 శాతం మేర రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి బాటలు వేశామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికల్లో ప్రజలే నేరుగా ఎన్నుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

**విపత్తుల సమయంలో సమర్థవంతమైన పాలన**

రాష్ట్రంలో సంభవించిన రెండు పెద్ద విపత్తుల సమయంలో కూటమి ప్రభుత్వం సమర్థ నాయకత్వంతో నష్ట నివారణ చర్యలు చేపట్టిందని తెలిపారు. తుఫాను కంటే వేగంగా
ప్రభుత్వ యంత్రాంగం పనిచేసి ప్రజలకు అండగా నిలిచిందన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో తీవ్రత ఉన్నప్పటికీ, ప్రభుత్వం సమర్థవంతమైన సాగునీటి నిర్వహణతో పరిస్థితులను నియంత్రిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో గ్రామాలే కీలకమని, ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని షేక్ బుర్హానుద్దీన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పంచాయతీ ఉప సర్పంచ్ టంగుటూరు శ్రీనివాసులు, నాయకులు సలాం, కలాం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌డివిజన్ పరిధిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ

- పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు....
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా....

ధర్మవరం నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :



ధర్మవరం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఈనెల 26న జరగనున్న తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, అదే రోజు నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి నిరంతర నిఘా కొనసాగించనున్నట్లు వెల్లడించారు.
సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలతో పర్యవేక్షణ చేపట్టడంతో పాటు కీలక కూడళ్లు, ప్రధాన రహదారులు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

- పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు...
- కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు....

ధర్మవరం / ముదిగుబ్బ నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :



గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముదిగుబ్బ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌనియా భరద్వాజ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీకి చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, సామగ్రి పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని, గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

# పంచాయతీ ఎన్నికల వేళ పోలీసుల హెచ్చరిక

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.....
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు.....

ధర్మవరం నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ పరిధిలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని, ఇతరులను రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 (గతంలో సీఆర్‌పీసీ సెక్షన్ 144) అమల్లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా

- పడి పూజ,భిక్ష దాత నాగరాజు స్వామి ( కుర్రిని రాజా )

యాడికి, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్ :



మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి భక్తి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగళ హారతి ని సమర్పించారు.భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. పడి పూజా కార్యక్రమం ను,మాలా ధరించిన స్వాములకు, భక్తులకు నాగరాజు స్వామి ( కుర్రిని రాజా ),కుటుంబం సభ్యులు ఏర్పాటు చేశారు. నాగరాజు స్వామి ( కుర్రిని రాజా ), కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో,సుఖశాంతులతో ఉండాలని అయ్యప్పస్వామి ని భక్తులు వేడుకోన్నారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గోన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు

**- పంపిణీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్.....**

**ధర్మవరం నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్ :**



రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైదానంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలు, ఎన్నికల సామగ్రి పంపిణీకి చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే సమయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా రూట్ మ్యాప్‌ల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బందిని సకాలంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు తగినన్ని బస్సులు, ఇతర వాహనాలను సిద్ధంగా ఉంచాలని, వాహనాల పార్కింగ్‌కు మైదానంలో ప్రత్యేక స్థలం కేటాయించాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరయ్యే సిబ్బందికి తాగునీరు, భోజన వసతి, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల సామగ్రి భద్రతకు కేంద్రం చుట్టూ పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, తహశీల్దార్ దేవరాజు, రెవెన్యూ, పోలీసు అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**- ప్రశాంత వాతావరణంలో పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు**

**- నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, నవంబర్ 25 , అనంత జనశక్తి న్యూస్:**



అనంతపురం జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నవంబర్ 26వ తేదీ గురువారం జరగనున్న పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ కోరారు.

జిల్లాలోని కళ్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 13 మండలాల్లో మొదటి విడత ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 2,388 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 218 గ్రామ పంచాయతీల్లో 8 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 210 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవులకు మొత్తం 539 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.అదేవిధంగా 2,318 వార్డు స్థానాలకు నోటీసులు జారీ చేయగా, 1,832 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. 483 వార్డులు ఏకగ్రీవం కాగా, మూడు వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. వార్డు సభ్యుల పదవుల కోసం మొత్తం 3,786 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

**పోలింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు**

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఎన్నికల విధుల కోసం 2,865 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,865 మంది ఓపీఓలు, 1,734 మంది ఓపీఓ 1లు, 232 మంది ఓపీఓ 2లను నియమించారు.ఎన్నికల సామగ్రితో పాటు పోలింగ్ సిబ్బంది బుధవారం సంబంధిత డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు.ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసివేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ విజ్ఞప్తి చేశారు.

# టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషితోనే రెండేళ్లలో ఎన్నో విజయాలు

**- ప్రజలకు సుపరిపాలన అందించడంలోనే నిరంతర సంతృప్తి**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**



టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషి, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతోనే గత రెండేళ్లలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయగలిగామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.డా. జి.లక్ష్మీశ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి బుధవారం నాటికి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పలువురు జిల్లా అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం, మహిళా సాధికారత, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ వికాస, ఇగ్నైట్ సెల్ కార్యక్రమాలకు స్కోచ్ అవార్డులు, ఆకాంక్షిత మండలాలకు నీతి ఆయోగ్ గుర్తింపు, గుంటుపల్లి రైజ్ కేంద్రం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం వంటి విజయాలు టీమ్ ఎన్‌టీఆర్ కృషికి నిదర్శనమన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యంగా వివిధ శాఖల పనితీరును 563 కీలక పనితీరు సూచీల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కులు, యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం వంటి కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు.

దసరా ఉత్సవాలు, సరస్ మేళా వంటి భారీ కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టగలిగామని పేర్కొన్నారు. ఈ విజయాల వెనుక ప్రతి అధికారి, ఉద్యోగి కృషి ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సమష్టిగా పనిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

## ప్రమాదంలో గాయపడిన సాయి కృష్ణకు మేయర్ రమేష్ గౌడ్ పరామర్శ



**అనంతపురం, నవంబర్ 25:అనంత జనశక్తి న్యూస్**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సాయి కృష్ణ యాదవ్ ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో నగర మేయర్ చిట్లూరి రమేష్ గౌడ్ బుధవారం ఆయనను పరామర్శించారు.నగరంలోని చంద్ర ఆసుపత్రి సమీపాన ఉన్న రాజహంస అపార్ట్మెంట్ లోని సాయి కృష్ణ యాదవ్ స్వగృహానికి మేయర్ రమేష్ గౌడ్ వెళ్లారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును, కాలికి తగిలిన గాయం తీవ్రతను గురించి ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎన్నికలు

**- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లు, పోలింగ్ అధికారులు, సిబ్బందికి కల్పించిన సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ముందస్తు చర్యలను పరిశీలించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలిదశ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో 116 వార్డులకు, మైలవరం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 154 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



# నల్లచెరువు మేజర్ పంచాయతీలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం..

**- ఎమ్మెల్యే కందికుంటకు**

**- అడుగడుగునా హారతులు పట్టిన * మహిళలు...**

**-ప్రతి గడపలోకి ప్రేమ ఆప్యాయతతో ఆహ్వానించిన ప్రజలు....**

**నల్లచెరువు నవంబర్ 25 అనంత జనశక్తి న్యూస్**

నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తాటిచెర్ల వహీదా ప్రచారం హోరెత్తుతోంది ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ నల్లచెరువు ఎస్సీ కాలనీలో ఉండే శ్రీ మారెమ్మ స్వామి దేవాలయం నందు పూజా కార్యక్రమం నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించి పలు విధుల్లో విస్తృతంగా పర్యటించారు సర్పంచ్ అభ్యర్థి వహీదా కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు గ్రామ ప్రజలు,మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు ఎమ్మెల్యే కందికుంటకు మరియు సర్పంచ్ అభ్యర్థి వహీదాకు అడుగడుగునా ప్రజలయొక్క ఆదరణ ఆప్యాయత వెల్లువెత్తింది.ప్రచార కార్యక్రమానికి లభించిన అనూహ్య స్పందనతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

ప్రతి ఇంటి తలుపు తడుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలతో నేరుగా మమేకమవుతూ గ్రామ అభివృద్ధికి మరియు అనుభవం ఉన్న సర్పంచ్ అభ్యర్థి వహీదాకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను ప్రతి ఒక్కరూ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అదేవిదంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని సర్పంచ్ అభ్యర్థి వహీదా ఉంగరం గుర్తుకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



## ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత



**- ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఈవీఎం గోదాము తనిఖీ**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినప్పటికీ, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అగ్నిప్రమాద నివారణకు ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాల పనితీరును తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో తనిఖీ వివరాలను నమోదు చేసి సంతకం చేశారు. గోదాము భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలను నిరంతరం పాటించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు యేదుపాటి రామయ్య (తెదేపా), మురళీకృష్ణ (ఐఎన్‌సీ), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), మురళీకృష్ణ (ఐఎన్‌సీ) తదితరులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్‌గా ఖాజావలి ఏకగ్రీవ ఎన్నిక



**- ఖాజావలికి సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు హృదయపూర్వక అభినందనలు**

**విజయవాడ నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్‌గా ఖాజావలి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖలో డివిజనల్ పీఆర్వో స్థాయి నుంచి దశలవారీగా ఎదుగుతూ జాయింట్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్న ఖాజావలి, జర్నలిస్టులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో రాజకీయ ఆటుపోట్లు, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మూడు దశాబ్దాలుగా అదే పార్టీలో కొనసాగడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేకమని కొనియాడారు. గతంలో లాల్జాన్, ఇతర మిత్రుల సహకారంతో పిడుగురాళ్లలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి గుంటూరు జిల్లా మహాసభను విజయవంతంగా నిర్వహించిన మధుర జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.నూతన బాధ్యతలు చేపట్టిన ఖాజావలి భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవలందిస్తూ, పిడుగురాళ్ల పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని నిమ్మరాజు చలపతిరావు ఆకాంక్షించారు. మరోసారి ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఎన్నికల వ్యయ నిఘాను కట్టుదిట్టం చేయాలి:




**- ఎన్టీఆర్ జిల్లా వ్యయ పరిశీలకులు బి. విజయ కుమార్**

*** 24 గంటలూ అప్రమత్తంగా ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు..**

**నిషిద్ధ వస్తువుల తరలింపుపై ఉక్కుపాదం**

*** వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఎన్నికల వ్యయ నిర్వహణ ఏర్పాట్లపై ఆకస్మిక తనిఖీ**

**వత్సవాయి/పెనుగంచిప్రోలు: నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ బుధవారం వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో పర్యటించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయ నిర్వహణ కోసం క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన అకౌంటింగ్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్, వీడియో సర్వెలెన్స్ టీమ్ పనితీరును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేసి సమీక్షించారు. నిషిద్ధ వస్తువుల తరలింపుపై నిఘా కొరకు ఏర్పాటు చేసిన ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి కేంద్రాల్లో ప్రతిరోజూ రిజిస్టర్లను తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నగదు, మద్యం, కానుకలు వంటి నిషిద్ధ వస్తువుల తరలింపు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు 24 గంటలూ అప్రమత్తంగా పనిచేస్తూ, సరిహద్దులు, ప్రధాన కూడళ్లు, ప్రవేశ మార్గాల్లో నిఘాను మరింత పెంచాలన్నారు. అకౌంటింగ్ టీమ్ అభ్యర్థుల రోజువారీ ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ 'షాడో రిజిస్టర్' నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తమ వ్యయ రిజిస్టర్లను నిర్దేశిత గడువులోగా బృందానికి సమర్పించేలా చూడాలన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు ఎంఆర్ఓ జారీ చేసే అనుమతుల వివరాలను వెంటనే ఎఫ్ ఎస్ టి, వి ఎస్ టి బృందాలకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ కార్యక్రమాలపై నిఘా ఉంచి, అభ్యర్థుల ఖర్చులను కచ్చితంగా లెక్కించాలన్నారు. మండల కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా ఫిర్యాదుల రిజిస్టర్‌ను నిర్వహించి, అందిన ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల నివేదికను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

## బిజెపి అధ్యక్షుడు పై దాడి చేసిన వారిని
# కఠినంగా శిక్షించాలి



**- బిజెపి నాయకుల డిమాండ్**

**లేపాక్షి ,నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్:**

బిజెపి మండల అధ్యక్షులు నరసింహమూర్తి పై మంగళవారం లేపాక్షి మండల కేంద్రానికి చెందిన బుల్లెట్ రవి అనే వ్యక్తి బిజెపి అధ్యక్షునిపై విచక్షణారహితంగా కర్రతో దాడి చేయడంపై బిజెపి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆర్జెహెచ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు శేఖర్ స్వామి బిజెపి నాయకులు మాట్లాడుతూ మండల బిజెపి అధ్యక్షులు నరసింహమూర్తి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, దాడి ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా, హిందూపురం చెందిన బిజెపి నాయకులు, స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కుటుంబానికి అండ.... పార్టీకి దిశానిర్దేశం.... చిట్రా రాజేశ్వరితో జగన్ భేటీ

**- పటాస్ శ్రీకాంత్ వ్యవహారంపై ఆరా.... ఉమ్మడి జిల్లా వైసీపీ రాజకీయ పరిస్థితులపై చర్చ**

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,**

**నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్:**

కుటుంబానికి అండగా ఉంటానంటూ వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చిన భరోసా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పటాస్ శ్రీకాంత్ తల్లి చిట్రా రాజేశ్వరి, జగన్మోహన్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ఎదుర్కొంటున్న కేసులు, కుటుంబ పరిస్థితులు, ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్సీపీ రాజకీయ పరిణామాలపై జగన్ ఆరా తీసినట్లు సమాచారం.

**పటాస్ శ్రీకాంత్పై నమోదైన కేసులే ప్రధాన చర్చ**

ఇటీవల పటాస్ శ్రీకాంత్పై నమోదైన కేసుల వ్యవహారంపై జగన్ ప్రత్యేకంగా చిట్రా రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. కేసుల నేపథ్యంలో కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయంగా ఎదురవుతున్న పరిస్థితులను ఆమె మాజీ ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం.



**"మీ కుటుంబానికి అండగా ఉంటాను"**

ఈ సందర్భంగా చిట్రా రాజేశ్వరికి జగన్ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. "మీ కుటుంబానికి అండగా నేను ఉంటాను. ధైర్యంగా ముందుకు వెళ్లండి" అంటూ ఆమెకు ధైర్యం చెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కష్టకాలంలో కుటుంబానికి నాయకత్వం అండగా ఉంటుందనే సంకేతాన్ని ఈ భేటీ ద్వారా జగన్ ఇచ్చినట్లు వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

**ఉమ్మడి జిల్లా రాజకీయాలపై జగన్ ఆరా**

పటాస్ శ్రీకాంత్ వ్యవహారంతో పాటు ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్సీపీ పరిస్థితి, క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న బలం, నాయకులు-కార్యకర్తల పరిస్థితి, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కూడా జగన్ వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. దీంతో ఈ భేటీ కేవలం పరామర్శకే పరిమితం కాకుండా జిల్లా రాజకీయ పరిస్థితులపై పార్టీ అధినేతకు క్షేత్రస్థాయి సమాచారం చేరవేసిన సమావేశంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**కుటుంబానికి భరోసాతో పాటు పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపే ప్రయత్నం**

ఒకవైపు పటాస్ శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం, మరోవైపు ఉమ్మడి జిల్లా రాజకీయ పరిస్థితులపై ఆరా తీయడం ఈ భేటీకి రాజకీయ
ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు నాయకత్వం అండగా ఉంటుందనే సందేశం వెళ్లేలా జగన్ వ్యవహరించినట్లు వైసీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో 69 వేట ఉచ్చులు తొలగింపు




**- అటవీ సిబ్బందికి ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అభినందనలు**

**- అటవీ ప్రాంతాల్లో నిఘా, గస్తీ మరింత పటిష్టం చేయాలని ఆదేశం**

**- బ్రేక్ వైర్ల దుర్వినియోగంపై మెకానిక్స్ కి అవగాహన కల్పించాలని సూచన**

**అల్లూరి జిల్లా నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

అటవీ సంపదను, వన్యప్రాణులను పరిరక్షించడంలో నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అక్రమ వేటను అరికట్టేందుకు అటవీ సిబ్బంది చేపట్టిన ప్రత్యేక పెట్రోలింగ్లో 69 వేట ఉచ్చులను గుర్తించి తొలగించారు. బుధవారం మారేడుమిల్లి రిజర్వ్ ఫారెస్ట్లోని కంపార్ట్మెంట్ నంబర్ 26/4లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించి, వన్యప్రాణులను అక్రమంగా వేటాడేందుకు మూడు చక్రాల వాహనాల బ్రేక్ వైర్లతో ఏర్పాటు చేసిన 69 ఉచ్చులను గుర్తించారు. వాటిని తొలగించి వన్యప్రాణులకు పొంచి ఉన్న ముప్పును నివారించారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, యానిమల్ ట్రాకర్లు, బేస్ క్యాంప్ సిబ్బందిని ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రశంసించారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అడవుల్లో నిరంతర గస్తీ, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తత, సమష్టి కృషి వల్ల అనేక వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు తప్పిందని పేర్కొన్నారు. అక్రమ వేట నిరోధానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. బ్రేక్ వైర్లతో ఉచ్చుల తయారీని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆటోమొబైల్ షాపుల యజమానులు, మోటార్ మెకానిక్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అడవుల్లో అమర్చే ప్రతి ఉచ్చు ఒక వన్యప్రాణి ప్రాణానికి ముప్పుగా మారుతుందని, వాటిని గుర్తించి తొలగించడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కీలకమైన సేవ చేసినట్లవుతుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వేటగాళ్ల నుంచి వన్యప్రాణులను రక్షించేందుకు అటవీ ప్రాంతాల్లో నిరంతర నిఘా, ప్రత్యేక పెట్రోలింగ్ వంటి చర్యలను మరింత పటిష్టం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల సంరక్షణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు.

# రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో ఎస్కేయూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



**- వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బహుమతుల సాధన**

**అనంతపురం నవంబర్ 25,అనంత జనశక్తి న్యూస్**

**శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం–2026 సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫోరం అనంతపురం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఎస్కేయూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. వివిధ పోటీల్లో బహుమతులు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు.వ్యాసరచన పోటీల్లో బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అల్ఫియా ప్రథమ బహుమతి సాధించగా, అదే తరగతికి చెందిన భవ్యశ్రీ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా వక్తృత్వ పోటీల్లో బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గురువెల్లి జ్యోత్స్న తృతీయ బహుమతి సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నారు.విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలు, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించుకుంటూ పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సోమశేఖర్ మనస్ఫూర్తిగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది కూడా విద్యార్థినులను అభినందించారు.

# భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

**- చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి**

**-ఎల్నినో ప్రభావం దృష్ట్యా జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, నవంబర్ 25:అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో తాగునీరు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా భూగర్భ జలమట్టాలను పెంచేందుకు నీటి పారుదల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు నిరంతర ప్రక్రియగా జల సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఎల్నినో ప్రభావం దృష్ట్యా రాబోయే వర్షపు నీటిని పూర్తిస్థాయిలో ఒడిసిపట్టుకునేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి వీడియో సమావేశం ద్వారా నీటి పారుదల శాఖ, డ్వామా అధికారులు, ఏపీ ఎడీలు, ఏపీవోలు, సహాయ ఇంజినీర్లతో వివిధ పనుల అమలు, పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనుల ప్రణాళికను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని, ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనుల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, కాలువలకు అవసరమైన మరమ్మతులను నిర్వహణ నిధుల కింద తక్షణమే పూర్తి చేయాలన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి చెరువులు, కుంటలకు మళ్లించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తద్వారా భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు విరివిగా పనులు కల్పిస్తూ జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని డ్వామా అధికారులకు సూచించారు. జలధార-జలహారతి 2.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పూడికతీత, చెక్డ్యామ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, చెరువుల పునరుద్ధరణ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.సమీక్షలో పాల్గొన్నప్రతి అధికారినీ 'నీటి సంరక్షణ బాధ్యత కలిగిన అధికారి'గా కలెక్టర్ అభివర్ణించారు. జిల్లాలో ఎక్కడా తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి అవసరం ఉన్నప్రాంతాలను గుర్తించి భూగర్భ జలాల పెంపునకు తగిన కార్యాచరణ అమలు చేయడం ప్రతి అధికారి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ, డ్వామా పీడీ విజయ ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ, డ్వామా శాఖ ఉన్నతాధికారులు, ఏపీఎడీలు, ఏపీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# నల్లమాడలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్సీ రమాదేవి ప్రచారం

**- ఐదు గ్రామాల్లో విస్తృత పర్యటన.. అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లకు విజ్ఞప్తి**

**నల్లమాడ నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్సీ వడ్డే దళవాయి రమాదేవి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ దంపతులు నల్లమాడ మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు.ఎర్రవంకపల్లి, నల్లమాడ, అప్పయ్యగారిపల్లి, పెమ్మనకుంటపల్లి, బడవాండ్లపల్లి, బాసంవారిపల్లి గ్రామాల్లో పర్యటించిన వారు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలన్నా, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా స్థానిక సంస్థల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమాల్లో వల్లిపి గంగులప్ప, గొడ్డలేగల శ్రీరాములు, డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర, నగరగిరి రామాంజనేయులు, మధుసూదనరెడ్డి, రజాక్, నాగరాజు, సూరి, బండి వెంకటనారాయణ, దాసరి సూర్యనారాయణరెడ్డి, మైలే శివశంకర్, కుంచపు చెన్నకేశవులు, పల్లపు శ్రీరాములు, యముతకురమణ, ధార్మిని కేశవ, కనుముక్కల లక్ష్మన్న, సంపంగి గంగరాజు, పల్లపు రామ్మోహన్, యముతక సోమశేఖర్, ప్రసాద్, వెంకటరాముడు, బి.కేశవ, ఏ.కేశవ, రామచంద్ర, నారాయణస్వామి, గంగులప్ప, చిన్నప్ప, రామప్ప, కుంచపు రాంప్రసాద్, మంకమూతుక గంగులప్ప, కుంచపు సుధాకర్, కుంచపు నాగరాజు, దండగల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీ కేఫ్లో యువతిపై సామూహిక అత్యాచారం

**న్యూఢిల్లీ, నవంబర్ 25, అనంత జనశక్తి న్యూస్**

తూర్పు ఢిల్లీలోని ప్రీత్ విహార్ ప్రాంతంలో ఒక కేఫ్ మూసిన తర్వాత జరిగిన వేడుకలో 22 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ రాజధాని ప్రాంతంలోని ప్రీత్ విహార్, మండవలి వంటి ప్రాంతాలు వాణిజ్య, ఆహార వ్యాపారాలకు పేరుగాంచాయి.

కేఫ్ మూసిన తర్వాత వేడుకకు ప్లాన్
పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం బాధితురాలు, ఆమె స్నేహితులు, నిందితులు వేర్వేరు కేఫ్లలో పనిచేస్తున్నారు. రాత్రి 11.30 గంటలకు ఒక కేఫ్ మూసిన తర్వాత అక్కడే పార్టీ చేసుకోవాలని వీరంతా నిర్ణయించుకున్నారు. బృందంలోని ఒకరి వద్ద ఆ కేఫ్ తాళాలు ఉండటంతో అక్కడికి చేరుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తొలుత ఆ కేఫ్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. ఆ తర్వాత వారంతా మండౌలి వెళ్లారు. అక్కడి నుంచి తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో నిందితుల్లో ఒకరు పనిచేస్తున్న ప్రీత్ విహార్లోని రెండో కేఫ్కు వెళ్లారు.
తెల్లవారుజామున 3.30 గంటలకు ఘటన పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ సీనియర్ పోలీసు అధికారి ఈ ఘటన వివరాలను పంచుకున్నారు. "బాధితురాలి కథనం ప్రకారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఇద్దరు పురుషులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మిగిలినవారు ఈ నేరానికి సహకరించారు. మొత్తం మీద ముగ్గురు మహిళలతో కలిపి ఏడుగురు ఆ కేఫ్లో ఉన్నారు. అందరూ మద్యం సేవించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఆ తర్వాత తన తల్లికి ఫోన్ చేసి ఇంటికి రావడం ఆలస్యమవుతుందని చెప్పారు" అని ఆ అధికారి తెలిపారు.ఘటన అనంతరం అందరూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.
తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
మిగతా నిందితుల కోసం గాలింపు
ఈ కేసు దర్యాప్తు పురోగతిపై తూర్పు డీసీపీ రాజీవ్ కుమార్ స్పందించారు. ఇద్దరు మహిళలు, ఒక పురుషుడిని అరెస్టు చేశామని, ఘటనలో పాలుపంచుకున్న మిగతా వారిని పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని డీసీపీ రాజీవ్ కుమార్ వెల్లడించారు.



# మేమేం బిచ్చగాళ్లం కాదు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 403 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్న ఉత్తర్ ప్రదేశ్లో తమ పార్టీకి 130 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సొంతంగా గెలిచింది కేవలం రెండు స్థానాలేనని గుర్తు చేస్తూ.. దానికి అదనంగా మరో 24 సీట్లు కలిపి మొత్తం 26 స్థానాలు ఇచ్చేందుకు ప్రాథమిక చర్చల్లో ప్రతిపాదించినట్లు ఎస్పీ ప్రధాన కార్యదర్శి రామ్ గోపాల్ యాదవ్ వెల్లడించారు. ఇలా సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలోనే ఐదు స్థానాలకు ఎస్పీ తన అభ్యర్థులను ఖరారు చేసింది. ఎస్పీ ప్రకటించిన ఈ ఐదు స్థానాల్లో నాలుగింటిలో ముస్లిం, దళిత ఓటర్లు గణనీయంగా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని భావిస్తున్న కాంగ్రెస్ వీటిలో రెండు స్థానాలను ఆశించింది.
మేము ఏమైనా బిచ్చగాళ్లలా కనిపిస్తున్నామా?
అంతేకాకుండా ఎస్పీ అభ్యర్థులను ప్రకటించిన నియోజక వర్గాల్లో ఇమ్రాన్ మసూద్ ప్రాతినిధ్యం వహిస్తున్న సహరన్పుర్ లోక్సభ పరిధిలోని ఒక స్థానం కూడా ఉంది. దీంతో హస్తం పార్టీ నేతలు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈ పరిణామాలపై ఇమ్రాన్ మసూద్ ఘాటుగా స్పందిస్తూ.. ఎస్పీ ప్రవర్తన ఏమాత్రం అర్థం కావడం లేదని, తాము ఏమైనా బిచ్చగాళ్లలా కనిపిస్తున్నామా అని ప్రశ్నించారు. తాము సీట్లు అడగకపోయినా 26 స్థానాలు ఇస్తామంటూ ఎస్పీ నేతలు ప్రకటించారని, చర్చలు కొనసాగుతుండగానే అభ్యర్థులను ఎలా ప్రకటిస్తారని ఆయన మండిపడ్డారు. సమాజ్వాదీ పార్టీతో సీట్ల సర్దుబాటు చర్చలను ఇకపై కొనసాగించాలా లేదా అన్న విషయంపై పార్టీ అధిష్ఠానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మసూద్ స్పష్టం చేశారు. మరోవైపు గెలుపు అవకాశాలను ప్రాతిపదికగా తీసుకునే మిత్రపక్షాల మధ్య సీట్ల కేటాయింపు ఉంటుందని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఇప్పటికే తేల్చి చెప్పారు.
2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఎస్పీ ఇదే తరహాలో వ్యవహరించిందని, చర్చలు జరుగుతున్నాయంటూనే ఆయా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్కు షాకిచ్చిందని రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. తాజా పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా ఇంకా స్పందించనప్పటికీ.. ఎస్పీ నిర్ణయంతో విస్మయానికి గురైనట్లు తెలుస్తోంది. కాగా విపక్ష కూటమిలోని ఈ కుమ్ములాటలపై భారతీయ జనతా పార్టీ ఎద్దేవా చేసింది. కనీసం తమ మిత్రపక్షాలకే గౌరవం ఇవ్వలేనివారు ఉత్తర్ ప్రదేశ్ ప్రజలను ఏ విధంగా గౌరవిస్తారని బీజేపీ విమర్శించింది.



# పుట్టిన పిల్లలు పగలంతా ఎందుకు పడుకుంటారు రాత్రుళ్ళు ఎందుకు పడుకోరు

**అప్పుడే పుట్టిన పిల్లల్ని హ్యాండిల్ చేయడమంటే అంత ఈజీ కాదు. పిల్లలు మన టైమ్‌కి అడ్జస్ట్ అవ్వడం కాదు. వారి టైమ్‌కే మనం అడ్జస్ట్ అవ్వాల్సి ఉంటుంది కొన్నిసార్లు. అయినప్పటికీ పిల్లలు అంత త్వరగా అడ్జస్ట్ అవ్వరు. నిద్రలేచే టైమింగ్ నుంచి తిరిగి పడుకునే టైమ్ వరకూ అంతా రివర్స్‌లోనే ఉంటుంది. దీంతో అప్పుడే తల్లులు అయిన వారి పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. రాత్రంతా మేల్కొని, పగలంతా పడుకుంటారు పిల్లలు. వారి వల్ల తల్లికి నిద్ర ఉండదు. రోజువారీ పనులు కష్టంగా మారతాయి. అసలు పిల్లలు ఇలా చేయడానికి కారణాలు ఏంటి? వారిని ఎలా మార్చాలో డాక్టర్ భగత్ చెబుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోలో ఆయన అన్ని వివరాలని షేర్ చేసుకున్నారు.**





### పిల్లలు పగలంతా ఎందుకు పడుకుంటారు

అప్పటివరకూ తల్లీ గర్భంలో ఉన్న పిల్లలకి పగలు, రాత్రి అనే తేడా ఉండదు. వారికి ఏ టైమ్ అయినా ఒకటే. తేడా అనేది తెలియదు. పుట్టిన తర్వాత కూడా కొన్నిరోజుల వరకూ వారు గర్భంలోనే ఉన్నట్లుగా ఫీల్ అవుతారు. ఈ కారణంగానే కడుపులో ఉన్నప్పుడు ఎలా అయితే ఉండేవారో బయటికొచ్చాక కూడా అలానే ఉంటారు.

### బ్రెయిన్ డెవలప్ కాకపోవడం

అదే విధంగా, పిల్లలకి బ్రెయిన్ పూర్తిగా డెవలప్ కాకపోవడం కూడా మరో రీజన్. దీని వల్ల 2 , 3 గంటల నిద్ర తర్వాత పాలు మళ్లీ నిద్ర ఉండేలా చూసుకుంటారు. అంతేకానీ, ఏది పగలు, ఏది రాత్రి అనేది తెలియదు. ఎప్పుడు పడుకోవాలనే విషయం వారి చిన్ని చిన్ని మెదడులకి తెలియదు. కాబట్టి, వెంటనే వారు రాత్రుళ్ళు పడుకోవాలని ఫోర్స్ చేయకుండా



మెల్లిమెల్లిగా అలవాటు అయ్యేలా చూడండి.

### రాత్రుళ్ళు ఎందుకు పడుకోరు

ముందుగా చెప్పుకున్నట్లుగా వారికి రాత్రి, పగలు తేడా తెలియదు. రాత్రిని కూడా పగలు లానే ఫీల్ అవుతారు. అందుకే, వారికి నిద్ర వచ్చినప్పుడు మాత్రమే నిద్రపోతారు. అంతేకానీ, రాత్రి మాత్రమే పడుకోవాలని అనుకోరు.

### నిద్రకి హెల్ప్ చేసే హార్మోన్

పిల్లల్లో నిద్రకి హెల్ప్ చేసే హార్మోన్ మెలటోనిన్ అనేది సరిగా పనిచేయదు. దీని వల్ల వారికి ఎప్పుడు పడుకోవాలో తెలియదు. అందుకే, వారికి



నచ్చినప్పుడు మాత్రమే పడుకుంటారు.

### మెటనోనిన్ అనేది రాత్రుళ్ళు చక్కగా పడుకునేలా చేస్తుంది. ఈ హార్మోన్ పనిచేయకపోవడం వల్ల నిద్ర సరిగా పట్టదు.

### పాలు తాగాక శక్తి పెరిగితే

అదే విధంగా, పిల్లలు రాత్రి టైమ్‌లో పాలు తాగుతారు. ఎక్కువగా తాగితే వారికి ఎక్కడలేని ఎనర్జీ వస్తుంది. దీంతో అప్పుడే అలర్ట్ అయి ఆడుతుంటారు. నిద్రపోరు. అలా కళ్ళు తెరిచి చూస్తూనే ఉంటారు. నిద్ర అనేది సరిగా పట్టదు.

### నిద్ర ఎలా సెట్ అవుతుంది

పగలు పడుకోవడం, రాత్రుళ్ళు మేల్కోవడం అనేది ముందుగా ప్రాబ్లమ్‌లా చూడొద్దు. 3, 4 నెలల తర్వాత నిద్ర అలవాటు సెట్ అవుతుంది. కాబట్టి, వారిని మెల్లిమెల్లిగా రాత్రుళ్ళు నిద్రపోయేలా చూడండి. పుట్టిన పిల్లలు ఎవరైనా వారి టైమింగ్స్ సెట్ కావడానికి కనీసం 3 నుంచి 4 నెలల టైమ్ పడుతుంది.



# పిల్లలకి డైపర్ వేయడం వల్ల రాషెస్, దురదలు వస్తున్నాయా, ఏం చేస్తే ప్రాబ్లమ్



**చిన్నపిల్లలకి దద్దర్లు రావడం అనేది చాలా సాధారణ సమస్య. దీనికి కొన్ని చిన్నచిన్న తప్పలే కారణం. పేరెంట్స్ తెలిసి, తెలియకుండా చేసే చిన్న చిన్న తప్పలే పిల్లల చర్మాన్ని దెబ్బతీస్తాయి. ముఖ్యంగా పేరెంట్స్ డైపర్ మార్చేటప్పుడు కొన్ని తప్పలు మానుకోవాలని పిల్లల డాక్టర్ అనురాధ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో క్లియర్‌గా చెప్పారు. ఈ వీడియోలో పిల్లల డైపర్‌ని ఎలా మార్చాలి, డైపర్ వేసినప్పుడు దద్దుర్లు రాకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతున్నారు. ఆ వివరాలేంటంటే**



### క్రీమ్స్ వాడడం

డైపర్స్ వేయడం వల్ల వచ్చిన రాషెస్, దద్దుర్లని తగ్గించేందుకు మంచి బారియర్ క్రీమ్ వాడడం మంచిది. అయితే, క్రీమ్‌ని శుభ్రమైన, పూర్తిగా పొడిబారిన చర్మంపై మాత్రమే అప్లై చేయడం మంచిది. క్రీమ్ మరీ హెవీగా రాయొద్దు. తక్కువగా రాస్తే మంచిది.

### ప్రతీసారి డైపర్ వద్దు

పిల్లలకి ఎప్పుడు డైపర్ వేసే ఉంచొద్దు. కొన్నిసార్లు డైపర్ లేకుండా ఉంచడం మంచిది. దీని వల్ల చర్మానికి గాలి తగులుతుంది. తేమ ఉండదు. దీంతో దద్దుర్లు తగ్గుతాయి. కాబట్టి, ఎక్కువ సమయం డైపర్ మీదనే కాకుండా నార్మల్‌గా ఉంచడం మంచిది.

### డైపర్ మార్చేటప్పుడు

డైపర్ మార్చేటప్పుడు బిడ్డ చర్మాన్ని ముందు నుండి వెనక్కి సున్నితంగా క్లీన్ చేయండి. అదే విధంగా, హార్ష్‌గా ఉండే ఎక్కువగా ఫ్రాగ్రెన్స్ ఉండే వైప్స్ వాడొద్దు. దీని వల్ల చర్మం డ్రైగా మారుతుంది. అవసరమైతే సాదా నీరు, సాఫ్ట్ కాటన్‌ని వాడండి. వీటి వల్ల స్కిన్ సాఫ్ట్‌గా మారుతుంది.

### సరైన సైజ్ డైపర్ తీసుకోవడం

అదే విధంగా, పిల్లలకి వాడే డైపర్స్ సరైన సైజ్‌లో తీసుకోవడం మంచిది. ఎక్కువగా టైట్‌గా ఉండే డైపర్







వేయొద్దు. దీని వల్ల గాలి ప్రవాహం తగ్గుతుంది. చర్మం తడిగా, చికాకుగా మారుతుంది. లూజ్ ఉండే డైపర్ కారణంగా లీకేజీలు ఉంటాయి. దీని వల్ల చర్మంపై సమస్యలు వస్తాయి. కాబట్టి, పిల్లల బరువు, నడుము సైజ్‌కి సరిపడే డైపర్ తీసుకోండి.

### డైపర్ ఎన్ని గంటలకోసారి మార్చాలి?

పిల్లల డాక్టర్ ప్రకారం, ప్రతీ 3, 4 గంటలకి ఓ సారి పిల్లల డైపర్ మార్చాలి. పిల్లలు మలవిసర్జన చేస్తే వెంటనే మార్చాలి. తడిగా, మురికిగా ఉన్న డైపర్‌ని ఎక్కువసేపు ఉంచితే దద్దుర్లు వస్తాయి. రాషెస్ పెరుగుతాయి. కాబట్టి, పిల్లల ఒంటిపై ఎక్కువసేపు డైపర్స్ ఉంచొద్దు. త్వరత్వరగా మార్చడం మంచిది.

### పౌడర్ వద్దు

కొంతమంది పిల్లలకి ఎక్కువగా పౌడర్ రుద్దుతారు. ఇలా చేయడం వల్ల తేమ లాక్ అయి చర్మం ఇరిటేట్ అవుతుంది. కాబట్టి, దీనిని వాడొద్దు. వీటి బదులు సరిగా పిల్లలకి చక్కగా గాలి తగిలేలా చూడండి. దీంతో పిల్లలకి తడి చర్మం ఉన్నా కూడా ఇబ్బందిగా అనిపించదు.



# శ్రద్ధా కపూర్ 'ఈథా'పై నెట్టింట విమర్శలు

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈథా' విడుదలకు సిద్ధమవుతోంది. ప్రముఖ తమాషా కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. డిసెంబర్ 4న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమా విడుదలకు ముందే శ్రద్ధా కపూర్ నటనపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ముఖ్యంగా ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోల్లో ఆమె చెప్పిన డైలాగ్‌లపై కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. మొదట 'ఈథా' సినిమాను మరో భారీ చిత్రం 'టాక్సిక్'తో పోటీగా విడుదల చేయాలని భావించారు. అయితే ఆ తర్వాత మేకర్స్ విడుదల తేదీని మార్చి డిసెంబర్ 4కు ఖరారు చేశారు. దీంతో బాక్సాఫీస్ వద్ద ఎదురయ్యే పోటీ విషయంలో చిత్రబృందం కొత్త నిర్ణయం తీసుకున్నట్లయింది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు.ఇప్పటివరకు విడుదలైన 'ఈథా' ప్రమోషనల్ కంటెంట్‌లో శ్రద్ధా కపూర్ లుక్, పాత్రకు సంబంధించిన అంశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. అయితే ఆమె డైలాగ్ డెలివరీ మాత్రం కొందరికి నచ్చలేదని తెలుస్తోంది. విఠాబాయి వంటి గొప్ప కళాకారిణి పాత్రలో కనిపిస్తున్న శ్రద్ధా.. ఆ పాత్రకు అవసరమైన గంభీరతను తన మాటతీరులో పూర్తిగా చూపించలేకపోయిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రచార వీడియోల్లో ఆమె పలికిన సంభాషణలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాత్రలోని భావోద్వేగాలను, తీవ్రతను శ్రద్ధా మరింత బలంగా పలికించాల్సిందని కొందరు కామెంట్లు చేస్తున్నారు.



# సంక్రాంతి బరిలో మెగాస్టార్ విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి మరోసారి ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఎన్నో ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఒకప్పుడు చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా ప్రచారం పొందిన ఈ చిత్రం, టీజర్ విడుదలైన తర్వాత మాత్రం అనూహ్యంగా విమర్శలను ఎదుర్కొంది. ముఖ్యంగా టీజర్‌లో కనిపించిన గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ నాణ్యతపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరిగింది. దీంతో మేకర్స్ సినిమాకు సంబంధించిన సీజీ పనులను మరోసారి మెరుగుపరిచే పనిలో పడ్డారు. అప్పటి నుంచి సినిమా విడుదల తేదీపై రకరకాల వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. గతంలో 'విశ్వంభర' సినిమాను 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారంటూ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఇదే సమయంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మరో చిత్రం 'కాకా' కూడా సంక్రాంతి విడుదలకు సిద్ధమవుతుండటంతో అభిమానుల్లో గందరగోళం మొదలైంది. 'కాకా' చిత్రాన్ని సంక్రాంతికే విడుదల చేస్తామని ఆ సినిమా మేకర్స్ పలుమార్లు స్పష్టం చేసారు. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా మరోసారి 'విశ్వంభర'



సంక్రాంతి బరిలోకి దిగనుందంటూ మీడియా వర్గాల్లో కథనాలు వెలువడుతున్నాయి. ఎంత ఆలస్యమైనా ఈ సినిమాను సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో మెగాస్టార్ అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. ఒకవేళ 'విశ్వంభర', 'కాకా' రెండు సినిమాలు ఒకే పండుగ సీజన్‌లో విడుదలైతే బాక్సాఫీస్ వద్ద పరిస్థితి ఎలా ఉంటుందనే ఆసక్తి నెలకొంది.

# ఎమ్మీ పురస్కారాల్లో భారతీయ సిరీస్‌లకు నిరాశ

ప్రతిష్టాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల పోటీలో నామినేషన్ వరకు వెళ్లిన భారతీయ సిరీస్‌లకు నిరాశ ఎదురైంది. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఈ వేడుకలో భారత్ తరపున ఉత్తమ కామెడీ సిరీస్ విభాగంలో నామినేట్ అయిన స్టాండప్ కామెడీ సిరీస్ 'వీర్ దాస్: ఫుల్ వాల్యూమ్' అవార్డును గెలుచుకోలేకపోయింది. అర్జెంటీనాకు చెందిన 'డివిజన్ పలెర్మో - సీజన్ 2' సిరీస్ ఈ అవార్డును సొంతం చేసుకుంది. అలానే 'రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్' ఉత్తమ డ్రామా సిరీస్ విభాగంలో నామినేషన్ వరకు వెళ్లగా ఫ్రెంచ్ హిస్టారికల్ డ్రామా 'కారెమె' అవార్డును దక్కించుకుంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ఎమ్మీలో రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. ప్రజెంటర్‌గా నటి ఆండ్రియాతో కలిసి ఉత్తమ టీవీ మూవీ/మినీ సిరీస్ అవార్డును అందించారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉందని ఆయన చెప్పారు.



# ఓటీటీలోకి 'ఆదర్శకుటుంబం'



వెంకటేశ్ - త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' . ఇటీవల విడుదలైన ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను మెప్పించింది. తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా నవంబర్ 27 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఎన్నో రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. కథేంటంటే...: చిట్టిబాబు (వెంకటేశ్) ఓ సాధారణ మధ్యతరగతి బ్యాంక్ ఉద్యోగి. భార్య స్వర్ణ (శ్రీనిధి శెట్టి) చిట్టీల వ్యాపారంలో మోసపోయి కుటుంబాన్ని అప్పులపాలు చేస్తుంది. ఇక చదువబ్బని కొడుకు సర్వ (ప్రజ్వల్).. మెకానిక్‌తో ప్రేమాయణం సాగించే కూతురు సంపూర్ణ (యువీనా) తెచ్చే తలనొప్పులు మరోవైపు. ఇలా అనేక సమస్యలతో సంసారాన్ని భారంగా నెట్టుకొస్తున్న చిట్టిబాబు జీవితాన్ని రూ.100కోట్ల లాటరీ రాత్రికి రాత్రే మార్చేస్తుంది. అంతవరకు ఓ అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డ తన కుటుంబం ఒక్కసారిగా ఖరీదైన గెటెడ్ కమ్యునిటీకి మారిపోతుంది. హౌస్ నెం.47 అనే విలాసవంతమైన బంగ్లాలోకి అడుగు పెడుతుంది. అయితే, అప్పుడే చిట్టిబాబు ఫ్యామిలీపై అత్యంత కిరాతకమైన బిహార్‌కు చెందిన టార్జన్ దోపిడీ ముఠా కన్నుపడటంతో కథ అనూహ్య మలుపు తిరుగుతుంది. అసలు ఆ టార్జన్ ముఠా నేపథ్యమేంటి? వాళ్లు చిట్టిబాబు కుటుంబాన్ని ఎందుకు లక్ష్యం చేసుకున్నారనేది కథ.

# డ్రాతో మొదలెట్టారు..

జెనీవా: డిఫెండింగ్ ఛాంపియన్ గుకేశ్, ఛాలెంజర్ సిందరోవ్ మధ్య ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ డ్రాతో మొదలైంది. మంగళవారం జరిగిన తొలి గేమ్‌లో ఆటగాళ్లు పాయింట్ పంచుకున్నారు. మొదటి గేమ్ 37 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. నల్ల పావులతో ఆడిన గుకేశ్ ఒత్తిడిని ఎదుర్కొన్నా.. సిందరోవ్‌ను నిలువరించగలిగాడు. 17వ ఎత్తు వేయడానికి అతడు 36 నిమిషాల 14 సెకన్లు తీసుకున్నాడు. దీంతో మిగతా ఎత్తులు వేయడానికి గుకేశ్ తక్కువ సమయం మిగిలింది. అయినా డ్రా చేసుకోగలిగాడు. రెండో గేమ్ బుధవారం జరుగుతుంది. 14 గేమ్‌ల పోరులో మొదట 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు.



# అగ్రస్థానానికి చేరువలో బుమ్రా

న్యూజిలాండ్‌తో డ్రాగా ముగిసిన తొలి టెస్టులో ఐదు వికెట్లు పడగొట్టిన టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంకును మెరుగుపర్చుకున్నాడు. బుమ్రా మూడు స్థానాలు ఎగబాకి 856 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఇంగ్లాండ్ ఆటగాడు రాబిన్సన్ కూడా బుమ్రాతో కలిసి రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. ఆసీస్ ఫాస్ట్‌బౌలర్ మిచెల్ స్టార్క్ (881) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టాప్-10లో బుమ్రా తప్ప మరే భారత బౌలర్ చోటు దక్కించుకోలేదు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ టాప్-10లో ఉన్నారు. పంత్ ఒక స్థానం మెరుగై ఆరో ర్యాంక్‌కు చేరుకోగా.. గిల్ మూడు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్ దక్కించుకున్నాడు. యశస్వి జైస్వాల్ ఐదు స్థానాలు మెరుగై తొమ్మిదో స్థానంలో నిలిచాడు. కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు ఎగబాకి 25వ ర్యాంక్ సాధించాడు. దేవదత్ పడిక్కల్ 15 స్థానాలు జంప్ చేసి 39వ ర్యాంక్‌లో నిలిచాడు.

# అలాంటి ఫీట్ మాపై చేయకూడదని కోరుకుంటా

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ చేసి ఔరా! అనిపించాడు. అతడి ఇన్నింగ్స్‌పై న్యూజిలాండ్ బౌలింగ్ కోచ్ జాకబ్ ఓరమ్ స్పందించాడు. అలాంటి ఫీట్‌ను అతడు తమపై చేయకుండా ఉండాలని మాత్రమే కోరుకుంటానని వ్యాఖ్యానించాడు. భవిష్యత్తులో వన్డే క్రికెట్‌కు ఎలాంటి ఢోకా ఉండదని స్పష్టం చేశాడు. "ఓ 15 ఏళ్ల కుర్రాడిని సేవియర్‌గా పిలవడం గొప్పగా అనిపిస్తోంది. ముస్ముందు ఇది ఎలాంటి ఫలితం ఇస్తుందో చూడాలి. ఇప్పడున్న యువత ఎక్కువ మంది టీ20 క్రికెట్‌ను.. సంప్రదాయవాదులు టెస్టులను ఇష్టపడతారు. కానీ, 50 ఓవర్ల క్రికెట్‌కూ ఇంకా స్థానం ఉందని నమ్ముతా. వైభవ్ ఆటను చూస్తుంటే ముచ్చటేస్తోంది. అభిమానులను అలరించడమే అతడి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇలాంటి ఆటగాళ్లు మరింత మంది వస్తే క్రికెట్ భవిష్యత్తు మరింత శోభాయమానంగా మారుతుంది. అయితే, వైభవ్ మాపై మాత్రం ఇలాంటి ఫీట్‌ను చేయకూడదని కోరుకుంటా" అని ఓరమ్ తెలిపాడు.




# నాపై కమిన్స్ మాటల దాడి తీవ్రంగా బాధించింది: ఉస్మాన్ ఖవాజా

శాండ్‌పేపర్ గేట్ వివాదంపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఇటీవల నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ తనను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఉస్మాన్ ఖవాజా వ్యాఖ్యానించాడు. బాల్ టాంపరింగ్ అంశంలో కేవలం ముగ్గురినే బలి చేశారని.. జట్టులోని మిగతా వారందరికీ ఆ విషయం తెలుసునని ఖవాజా తన ఆత్మకథ పుస్తకంలో ప్రస్తావించాడు. అప్పటి నుంచి ఆసీస్ క్రికెట్‌లో తీవ్ర దుమారం రేగుతోంది. ఖవాజా చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని కమిన్స్ కొట్టిపడేశాడు. "కమిన్స్ వ్యాఖ్యలు నాకు ఆశ్చర్యం కలిగించాయి. ప్యాట్‌ను వ్యక్తిగతంగా నేను చాలా ఇష్టపడతా. నాయకుడిగా అద్భుతమైన వ్యక్తి. కానీ, అతడి నుంచి ఇలాంటి మాటలు వస్తాయని ఊహించలేదు. అదీనూ నన్ను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకోవడం తీవ్రంగా బాధించింది. నేను ప్రస్తావించిన విషయాలపై చాలాసేపు విమర్శలు చేస్తూనే ఉన్నారు. కమిన్స్‌లో ఆ కోణాన్ని నేనెప్పుడూ చూడలేదు. అందుకే, చాలా నిరాశకు గురయ్యా. ప్యాట్ ప్రెస్ కాన్ఫరెన్స్ పూర్తిగా చూడాలనుకోలేదు. కానీ, ఏం చెప్పాడనేది తెలుసుకోవడానికి చూశా. పక్కనే నా భార్య రేచల్ ఉంది. 'బాగానే ఉన్నావుగా' అని అడిగింది. కానీ, ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. ఆ సమయంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యా. నా సమస్య ప్యాటీ కాదు. సీపలోని కొందరు ఉన్నారు. వారు ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటే బాగుండేది. కమిన్స్ సమస్య కూడా కాదు. ఇది క్రికెట్ ఆస్ట్రేలియాకు చెందిన వ్యవహారం. ఎలాగైనా విజయం సాధించాలనే దృక్పథం కోచ్‌ల నుంచి ఆటగాళ్ల వరకూ విస్తరించింది. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నా." అని ఖవాజా వెల్లడించాడు.






PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314